ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 9 ఫిబ్రవరి 2025





జంక్ ఫుడ్‌తో.. జర భద్రం

- చిన్నారులు, యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- అరికట్టకపోతే రక్తహీనత, ఊబకాయం
- మద్యపానం, ధూమపానంలానే ప్రమాదం అంటున్న వైద్యులు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలను పట్టించుకోని అధికారులు
- పిల్లల ఆరోగ్యంపై హెచ్చరిస్తున్న వైద్యులు

ప్రస్తుతం చిన్నారులు, యువత జీవితాల్ని చిరుతిళ్లు శాసిస్తున్నాయి... బయటకు వచ్చిన తరువాత అడుగడుగున చిరుతిండి దుకాణాలు, హోటళ్ల ద్వారా జంక్‌ఫుడ్ దొరుకుతుంది.. అది వారికి బలమివ్వకపోగా ప్రమాదంలోకి నెడుతుంది.. అందుకే వారి చదువుపై దృష్టిపెట్టినట్లే ఏమి తింటున్నారో అనే విషయంపై అనుక్షణం ఓ కన్నేసి ఉంచాలి.. ఒక్కసారి జంక్ ఫుడ్ భారిన పడిన తరువాత ఆ ప్రభావం వారిపై జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



రక్తహీనత, ఊబకాయం

జంక్‌ఫుడ్ కారణంగా బాలికల్లో రక్తహీనత, బాలురలో ఊబకాయం పెరుగుతోంది. కొంత మంది మగ పిల్లలు సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా ఉంటారు. దీనికి కారణం శరీరంలో జంక్‌ఫుడ్ వ్యర్థాలు పేరుకుపోవడమే. బాలికల్లో జంక్‌ఫుడ్ కారణంగా సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం.. నరాలు నొప్పులు, కంటిచూపు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అంటూ హెచ్చరికలు చేస్తున్న ప్రభుత్వాలు అదే స్థాయిలో జంక్‌ఫుడ్ ప్రమాదమని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే సినిమా థియేటర్లలో వీటి బారిన పడకుండా ప్రచార చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. అంతేగాక జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. ఆల్కహాల్ వంటివి చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ఎక్కువ నష్టం చేస్తుందని స్పష్టం చేసింది. జంక్ ఫుడ్ బారిన పడే వారి సంఖ్య రోజు రోజుకూ అధికమవుతోందని వాటి నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టకపోతే అనారోగ్య భారత్‌ను చూడవలసి వస్తుందని తెలిపింది.

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్యాకింగ్ ఫుడ్‌లో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధించింది. కానీ అవి జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉంటారు. రుచి, ఫ్లేవర్, కలర్స్, అధిక తీపి వంటి వాటికోసం వీటిని వాడుతుంటారు. కానీ ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. అందుకే జంక్‌ఫుడ్ తయారీ దారుల దగ్గర ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్రలేని ప్యాకింగ్‌లు మాత్రమే ఉంటాయి. ముఖ్యంగా ప్రొఫైల్ గానెట్, పొటాషియం బ్రిమెట్, మోనోడియం గ్లూటామెట్, డై ఏసిటల్ వంటి రసాయనాలపై నిషేధం విధించింది. కానీ ఇవి జంక్‌ఫుడ్ తయారీదారులు దగ్గర అందుబాటులో ఉంటాయి. అంతేగాక అధిక తీపిని ఇచ్చే హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ రసాయనం కూడా వినియోగించకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయని దీనిపై నిషేధం విధించారు. పంచదార కంటే దీని ధర తక్కువగా ఉండటంతో వ్యాపారులు దీనిని వాడుతుంటారు. దీనిని మనం తాగే శీతల పానీయాల్లో వినియోగిస్తుంటారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు..

ఫాస్ట్‌ఫుడ్, ఇతర ఆహారం వల్ల నేటి తరంలో అన్ని వయస్సుల వారి పొట్టల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే చిన్న పిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు చాక్లెట్‌లను తింటున్నారని ఒక అంచనా.. ఈ కారణంగా ఆయా వయస్సుల వారీగా ప్రతి ఒక్కరిలో 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. వీటి ప్రభావం ఎముకల ఎదుగుదలపై పడి మనిషి పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అంతేగాక ఫాస్ట్ ఫుడ్‌లలో వాడే మైదా, నూనె వంటి వాటితో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. ఇవి కూడా ఎముకల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంటాయి.



ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు

- పాఠశాలలకు, విద్యార్థుల వసతి గృహాలకు 50 మీటర్ల వరకు చిరుతిళ్ల దుకాణాలపై నిషేధం
- పిల్లలకు ఇచ్చే స్నాక్స్ బాక్సుల్లో సాధ్యమైనంత వరకు ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లంతో చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలుతో తయారు చేసే వంట కాలు ఉండేలా చూడాలి.
- ఒక్కసారి తింటే ఏమవుతుంది అని జంక్‌ఫుడ్ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించకూడదు.
- పిల్లలు రోజూ తినే ఆహారంలో 300 గ్రాముల కూరగాయలు, వీటిలో ఆకుకూరలు 50 గ్రాములు, దుంపలు 50 గ్రాముల ఉండేలా చుసుకోవాలి.
- దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలను నిర్వహిస్తూ ఉండాలి.
- ఆర్థిక పరిస్థితి సహకరించని కుటుంబాల్లో ఆ ఇంట్లో వండిన ఆహారాన్ని మాత్రమే పిల్లలకు అందించాలని ఎట్టి పరిస్థితుల్లో బయటనుంచి తెచ్చిచిరుతిళ్లు పెట్టకూడదు.

రక్తహీనత పెరిగింది

గత ఐదేళ్లలో అన్ని వయస్సుల మహిళల్లో రక్తహీనత సమస్య బాగా పెరిగింది. ముఖ్యంగా బాలికల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. జంక్‌ఫుడే దీనికి ప్రధానకారణం. పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్ కేక్‌లు తింటూ ఉండేవారిపై ఈ సమస్య కనిపిస్తుంది. దీంతో సరైన సమయంలో పీరియడ్స్ రావు. ఒకోసారి రెండు నెలలకు ఒకసారీ కూడా రాకుండా ఉంటాయి. ఈమధ్య ఇటువంటి సమస్యలతో ఎక్కువమంది వస్తున్నారు. వీటికి మందులతో పూర్తిగా పరిష్కరించలేం. ఆహారపు అలవాట్లు పూర్తిగా మార్చుకోవాలి. ఇంట్లో వండేవాటినే తినాలి. అలాగే పండ్లు, మాంసాహారం తీసుకోవాలి.



ఎన్ ఉమాజ్యోతి, ప్రొఫెసర్, మానసిక వ్యాధుల నిపుణులు, జీ జీ హెచ్

వసతి గృహాల్లో..

- శుభ్రమైన తాగునీరును అందించాలి.
- తృణధాన్యాలు, పాలు, గుడ్లు ఇతర పౌష్టికాహారంతో కూడిన మోను ఉండాలి.
- తాజా, గుర్తింపు పొందిన ఉత్పత్తులను వంటకు ఉపయోగించాలి. వంటనూనె రోజుకు ఒకసారి వినియోగించాలి. అది రోజూ ఒక చిన్నారికి అందించే ఆహారంలో 25 గ్రాములు మించ కూడదు.
- క్యాంటీన్‌లలో మిఠాయిలు, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, చిప్స్, పిజ్జా, సమోసాలు, నూడిల్స్, శీతలపానీయాలు పూర్తిగా నిషేధించాలి. కాకపోతే ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు జిల్లాలోనే కాదు, పూర్తిగా రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదు.



తల్లిదండ్రులే జాగ్రత్తగా ఉండాలి..

ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని అనుకోవడం కన్నా, వీటి ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. దీనికి తోడు పిల్లలకు అందుబాటులో ఉండే ఆహారాన్ని మాత్రమే ఇష్టపడుతుంటారు. వారికి అందుబాటులో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉంచే బాధ్యతను కూడా తల్లిదండ్రులే చూసుకోవాలి. తయారు చేసుకునే ఆహారం నిల్వ ఉన్నప్పటికి అది తీసుకుంటే అంతగా శరీరంపై ప్రభావం చూపదు. కానీ జంక్‌ఫుడ్ అలా కాదు, శరీరంలోనే పేరుకుపోతుంది. అంతేగాక నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ, మెదడు, గుండెతో పాటు 18 రకాల అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన కూడా వింతగా ఉంటుందని, విపరీత మనస్తత్వంతో పాటు, చిన్న చిన్న కారణాలకు ఆవేదన చెందుతూ ఆత్మహత్యల వైపు వెళ్తూ ఉంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చిన్నారులకు అందాల్సినవి...

7-10 మధ్య వయస్సు కలిగిన అబ్బాయిలకు 77 గ్రాములు, 11-14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి 86 గ్రాములు కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని అందించాలి. అమ్మాయిలకు 68 గ్రాములు, 70 గ్రాముల అందాలి. 14 సంవత్సరాల లోపు వరకు అమ్మాయిలకు, అబ్బాయిలకు గాని 170-250 గ్రాములు కార్బోహైడ్రేట్లు ఆహారంలో ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలు అయినా గానీ అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి. పాలు, గుడ్లుతో పాటు ప్రతి రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి.

పెంచకపోగా.. కుదింపా?

- రైల్వే బోర్డు నిర్ణయంపై ఆందోళన
- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో గుంటూరుకు నష్టం
- సరుకు రవాణాతోనే డివిజన్‌కు 64 శాతం ఆదాయం
- లోడింగ్ స్టేషన్లు దక్షిణ మధ్య రైల్వేలోకి వెళ్లేలా ప్రతిపాదనలు
- వాటిని ఆమోదిస్తే గుంటూరు రైల్వే డివిజన్ ఉనికికే ప్రమాదం
- నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గం పూర్తి అయితేనే పునర్ వైభవం



గుంటూరు రైల్వే డివిజన్‌లో సరుకు రవాణా టెర్మినల్

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంటూరు డివిజన్ పరిధి కుదించుకుపోనుంది. పొరుగున ఉన్న విజయవాడ డివిజన్‌కు అదనంగా మోటుమర్రి సెక్షన్‌ని ఇచ్చిన రైల్వేబోర్డు గుంటూరు డివిజన్ పరిధిని పెంచకపోగా తగ్గించేందుకు అడుగులు వేస్తుండటంపై ఇక్కడి అధికారవర్గాలు ఆం దోళన చెందుతున్నాయి. ఆదాయంలో సింహ భాగం సరుకు రవాణాపై ఆధారపడి ఉన్న గుంటూరు రైల్వే డివిజన్‌కి కొత్త సమస్య వచ్చి పడింది. ప్రత్యామ్నాయంగా నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం సంపూర్ణమైతేనే సరుకు రవాణ పెరగడానికి ఆస్కారం ఉంటుంది. అప్పటివరకు (మిగతా 8వ పేజీలో)



వారెక్కడ?

- రికార్డుల్లో ఉన్నారు.. మ్యాపింగ్‌లో లేరు
- మూడు నెలలుగా కొలిక్కిరాని కసరత్తు
- హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పట్టణ ప్రాంతాలు వెనుకంజ
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సర్వేకు దూరంగా పలు గృహాలు

2.19 లక్షల మంది జాడలేదు

కష్టంగా గుర్తింపు

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పౌరుల జాడ తెలియడంలేదు. వారిని గుర్తించి సర్వే పూర్తి చేయడం సచివాలయ సిబ్బందికి కత్తిమీద సాములా మారింది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరి పట్టణాల్లో ఎక్కువగా సిటిజన్స్ మిస్సింగ్ ఉంది. గుంటూరు జిల్లాలో 1,17,168 మంది, పల్నాడు జిల్లాలో 91,693 మంది, బాపట్ల జిల్లాలో 10,906 మంది సిటిజన్స్ మిస్సింగ్ అని లెక్కలు చెబుతున్నాయి. వీరంతా ఇక్కడ జనాభా లెక్కల్లో నమోదై వేరే ప్రాం తంలో ఉండడంతో మిస్సింగ్ కింద చూపిస్తున్నారు.

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 2,19,767 పౌరులు అదృశ్యమయ్యారు. వారంతా రికార్డుల్లో ఉన్నారు. కానీ ఎక్కడున్నారో తెలియడంలేదు. మూడు నెలలుగా కసరత్తు చేస్తున్నా వారి జాడ తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో ఎవరు ఉన్నారో.. ఎవరు లేరో.. తేలితే పథకాలు అములు చేయడం తేలిక అని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ ఉద్దేశంతో మూడు నెలల క్రితం సచివాలయాల పరిధిలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేకు ఆదేశించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి ఇంటిని యాప్‌లో మ్యాప్ చేసి, అందరి వివరాలు నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించింది. అయితే జనాభా లెక్కల రికార్డుల్లో ఉన్న వారు ఆయా ఇళ్లలో లేరు. ఇళ్లలో ఉన్న వాళ్ళు జనాభా లెక్కల రికార్డుల్లో లేరు. ప్రభుత్వం మూడు నెలల క్రితం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వేలో ఇలాంటి వింత అనుభవాలు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అనేకం వెలుగుచూస్తున్నాయి.

ఇల్లు ఉంది మనుషులు లేరు..

సచివాలయాలను క్లస్టర్లుగా విభజించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను సిబ్బంది చేపట్టారు. మూడు నెలలుగా సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్తున్నా చాలాచోట్ల అసమగ్ర సమాచారం లభ్యమవుతోంది. ఉమ్మడి మూడు జిల్లాలో చాలా గృహాల్లో అసలు మనుషులు లేనట్లు తేలుతుంది. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇంటి యజమాని వేరే చోట ఉండడంతో మ్యాపింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుంది. మూడు నెలలుగా ఈ కసరత్తు జరుగుతున్నా ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో ఇంకా చాలా గృహాలు (మిగతా 8వ పేజీలో)

మేయర్‌గా నాని అభ్యర్థిత్వంపై అయిష్టత

- పెమ్మసాని ప్రకటనతో సమావేశం నుంచి 13 మంది కార్పొరేటర్లు వాకౌట్
- ఎమ్మెల్యేలు నసీర్, మాధవి కూడా వెళ్లిపోవడంతో నిర్ఘాంతపోయిన కేంద్ర మంత్రి

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్‌గా టీడీపీ తరఫున కోవెలమూడి రవీంద్ర(నాని) అభ్యర్థిత్వాన్ని పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు వ్యతిరేకించారు. ఇటీవల నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి తరపున ఆరుగురు గెలుపొందారు. దీంతో మేయర్ పీఠాన్ని కూడా కూటమికి వశం చేయాలని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని వ్యూహరచన చేస్తున్నారు. ఈ క్రమంలో గత కొంత కాలంగా టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లకు పెమ్మసాని చంద్రశేఖర్‌తో పరిచయ కార్యక్రమం, స్టాండింగ్ కమిటీ సభ్యులకు అభినందన పేరుతో శనివారం రాత్రి పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పరిచయాలు, సత్కారాల అనంతరం మేయర్ అభ్యర్థిగా నాని పేరును పెమ్మసాని ప్రస్తావించారు. దీంతో 13 మంది కార్పొరేటర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేసిన జనసేన కార్పొరేటర్లు కూడా నానీని వ్యతిరేకించిన వారిలో ఉన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు నసీర్, మాధవి కూడా వెళ్లిపోయారు. ఈ పరిణామంతో కేంద్రమంత్రి పెమ్మసాని నిర్ఘాంతపోయారు.



మేయర్‌గా నాని పేరు ప్రస్తావించక ముందు జరిగిన సమావేశంలో కార్పొరేటర్లతో పెమ్మసాని

ఆలపాటి.. ధూళిపాళ్ల మధ్య సయోధ్య?

- నరేంద్రకు ఫోన్ చేసి మద్దతు కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజా
- రెండు, మూడు రోజుల్లో ఇద్దరి సమక్షంలో పొన్నూరులో సమావేశం

8

వాసవీ పీఠాధిపతి.. తెనాలి వాసే

ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రబ్బానీ



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ గౌస్ రబ్బానీ ఎన్నికయ్యారు. గుంటూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.సుజాత, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.విజయలక్ష్మి, వై.వీరాంజనేయులు, ఎస్.కనకాంబరం, కె.జ్యులిత్, కార్యదర్శిగా సంకుల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగ సులోచన, ఎన్‌వీ శివయ్య, షేక్ తాజుద్దీన్, కోశాధికారిగా బీహెచ్ పి శేషసాయి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్ కే ఇబ్రహీం హలీలుల్ల, డి.రవికిరణ్, సీహెచ్ ఎస్ఆర్‌కే శర్మ, ఆర్ సాయికృష్ణ ఎన్నికయ్యారు.

మ్యూజియంను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



మ్యూజియంలో అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండపై గల మ్యూజియాన్ని శనివారం అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. శ్రీలంక, మయన్మార్ కంబోడియా, లావోస్, థాయిలాండ్, వియత్నాం తోపాటు భారతదేశానికి చెందిన 27 మందితో కలిపి మొత్తం 88 మంది బౌద్ధ భిక్షువులు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ త్రిపిటిక పఠనోత్సవంలో పాల్గొనేందుకు వచ్చారు. శనివారం వీరు మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం, శిలాశాసనాలు, శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. మ్యూజియం విశేషాలను పురావస్తు పరిశోధకుడు, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బౌద్ధ భిక్షువులకు వివరించారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డీఆర్ శ్యాంసుందరరావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ముగిసిన మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాల మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ శనివారం రాత్రి ముగిసిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు జిల్లాలో 13 షాపులకుగానూ 233 దరఖాస్తులు, పల్నాడు జిల్లాలో 13 షాపులకుగానూ 199 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటన్నిటికీ ఈ నెల 10న లాటరీ నిర్వహించి షాపుల లైసెన్స్ దారులను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఎడ్ల పోటీలతో రైతుల్లో ఉత్సాహం

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మోర్జంపాడులో యరపతినేనికి షీల్డ్ బహూకరిస్తున్న దున్నా చెన్నయ్య చౌదరి

మాచవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో తిరునాళ్ల సందర్భంగా జరిగే ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలోని నరసింహ స్వామి 69వ కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులే కాకుండా వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు కూడా పందెపు ఎద్దులను పెంచుతున్నారని తెలిపారు. తొలుత మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు ఘన స్వాగతం పలికి పూలమాలలతో, దుశ్శాలువాలతో యరపతినేనిని సత్కరించారు. ఎడ్ల పోటీల నిర్వాహకులు యరపతినేని శ్రీనివాసరావు చేత పోటీలు ప్రారంభింప చేశారు. పోటీలు ప్రారంభం అనంతరం జిల్లా తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్య చౌదరి యరపతినేనికి షీల్డ్ బహూకరించారు.

బాపట్ల, గుంటూరు కంబైన్డ్ జతకు ప్రథమ స్థానం

జతపళ్ల విభాగంలో బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మోపర్తి నవీన్ కుమార్ చౌదరి కంబైన్డ్ ఎడ్లు 3739 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన జువ్వాజీ మేఘనా నాయుడు ఎడ్లు 3653.4 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలిచాయి. 3, 4 స్థానాలను ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు గ్రామానికి చెందిన పచ్చిగారి హరికృష్ణ నాయుడు, విజయలక్ష్మి నాయుడు, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుడిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3,600 సమాన అడుగుల దూరాన్ని లాగి 3, 4 స్థానాలు, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ ఎడ్లు 3291.4 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగ మల్లేశ్వరరావు ఎడ్లు 3219.2 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అంకలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లెబోయిన నాగార్జున ఎడ్లు 3179.6 అడుగుల దూరాన్ని లాగి 7వ స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను బహూకరించారు. వీరికి గ్రామానికి చెందిన తొగత వీర క్షత్రియ సంఘం వారు బహుమతులను అందజేశారు. నిర్వాహకులుగా కృష్ణ జిల్లా పెనుమచ్చ గ్రామానికి చెందిన సూరపనేని రాధాకృష్ణ వ్యవహరించారు.

కుంభమేళా ఆర్టీసీ స్పెషల్ బస్సుకు అనూహ్య స్పందన

- ఈనెల 15న అదనంగా మరో బస్సు ఏర్పాటు
- ప్రయాణికుడికి టిక్కెట్ ధర రూ. 8,300

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలకు (ప్రయాగరాజ్) కు వెళ్లే వారి కోసం ఆర్టీసీ గుంటూరు-2 డిపో అధికారులు ఏర్పాటు చేసిన స్పెషల్ హైటెక్ (2+2) పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ముందుగా ప్రకటించినట్లుగా ఈనెల 11న వెళ్లే స్పెషల్ బస్సుకు ప్రయాణికుల నుంచి టిక్కెట్ బుకింగ్స్‌తో ఫుల్ అయిపోయినట్లు డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన స్పందనకు అనుగుణంగా ఈనెల 15న అదనంగా మరో సర్వీసు మహా కుంభమేళాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న గుంటూరు బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 8 రోజుల్లో తొలి రోజు గుంటూరు నుంచి బయల్దేరి రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. మూడో రోజు మొత్తం ప్రయాగరాజ్‌లో బస చేసి పుణ్య స్నానాలు ఆచరించి, 4వ రోజు రాత్రికి అయోధ్య చేరేందుకు బయల్దేరుతుందన్నారు. 5వ రోజు ఉదయం అయోధ్య చేరుకొని, బాలరాముని దర్శించుకొని, సాయంత్రానికి వారణాసి బయల్దేరుతుందని తెలిపారు. ఆరో రోజు ఉదయం వారణాసి చేరుకొని, ఆ రోజు వారణాసిలో బస చేసి ఏడో రోజు ఉదయం వారణాసి నుంచి బయలు దేరి ఎనిమిదివ రోజు రాత్రికి గుంటూరు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్ కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కూడా ఉందని డీఎం తెలిపారు. ఈ సదావకాశంను గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 కిలోమీటర్లు లోపు 35 మంది ప్రయాణికులు ఒకే చోటు నుంచి బయల్దేరితే బస్సు అక్కడికి పంపుతామన్నారు. ఒక్కో టికెట్ ధర రూ. 8300 మాత్రమేనని, ఇతర ఖర్చులు, భోజనం, వసతి ఖర్చులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచారించి, శుద్ధిని, మోక్షాన్ని పొందుటకు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382897459, 7382896403, 7382894613 సంప్రదించాలన్నారు.

భూములను ఆక్రమించి.. గ్రామ బహిష్కరణ చేశారు

- పల్నాడు కలెక్టరేట్‌ను ఆశ్రయించిన రామాంజనేయపురం ఎస్టీ కాలనీవాసులు



కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భూమి పట్టాలు చూపుతున్న రామాంజనేయపురం బాధితులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ బహిష్కరణ చేసి.. నిత్యావసర వస్తువులు, నీరు ఇవ్వడంలేదు.. అంటూ పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మన్నే సుల్తాన్‌పాలెం శివారు రామాంజనేయపురం ఎస్టీకాలనీవాసులు శనివారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌కి వచ్చారు. రెండో శనివారం కావడంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు కార్యాలయం సమీపంలో మీడియాకు తమ గోడు చెప్పారు. అటవీ హక్కు చట్టప్రకారం ప్రభుత్వం 20 మందికి 71 ఎకరాలు పట్టాలు ఇచ్చిందనీ, అయితే వర్షా భావ పరిస్థితిలో జీవనం కోసం సమీప పట్టణాలు, ఇతర ప్రాంతాలకు వలసలు పోయామన్నారు. దీంతో తమ భూములను కొంతమంది దళారుల సహాయంతో ఆక్రమించారన్నారు. భూముల కోసం తాము రామాంజనేయపురం రాగా సర్పంచి భర్త రాము మరికొందరు తమపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఉండడానికి వీలు లేకుండా నిత్యావసర వస్తువులు, నీరు ఇవ్వకుండా గ్రామ బహిష్కరణ చేశారని తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు సభావత్ తావులాల్‌నాయక్, పోలా దుర్గమ్మ, పోలా గురవమ్మ, వజ్రగిరి కోటయ్య, వజ్రగిరి నాగయ్య, బుజ్జమ్మ, నేనావత్ దేవికాబాయి, సభావత్ లీలాబాయి, సభావత్ కిమినిబాయి, దానవత్ భద్రిబాయి, కొర్ర శివలాల్, రామవత్ నాగనాయక్, రామవాత్ సరోజబాయి తదితరులు కలెక్టరేట్‌ను ఆశ్రయించిన వారిలో ఉన్నారు.

వారెక్కడ?

(5పేజీ తరువాయి)

మ్యాపింగ్‌కు దూరంగానే ఉన్నాయి.

ఓటీపీ చెప్పకపోవడంతో జాప్యం

సర్వే ప్రక్రియలో ఇంటి యజమాని ఫొటో, బయో మెట్రిక్, ఓటీపీ ద్వారా వివరాలు ఖరారు చేయాలి. మనిషి అందుబాటులో లేకపోయినా మ్యాపింగ్ చేయవచ్చు. మ్యాపింగ్‌కు మనిషి దగ్గర ఉండాల్సిన పనిలేదు. వారెక్కడ ఉంటున్నా ఓటీపీ చెబితే సచివాలయ సిబ్బంది మ్యాప్ చేస్తారు. కానీ సైబర్ నేరాలు మీద ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో సచివాలయ సిబ్బంది అని చెప్పినా అంత తేలికగా ఓటీపీ చెప్పడం లేదు. దానివల్ల హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. ఓటీపీ వ్యవహారంలో ఎదురౌతున్న అనుభవాలను జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులకు నివేదించడంతో యాప్‌లో మార్పులకు శ్రీకారం చుట్టారు.

మరో 15 రోజులు గడువు..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌పై అధికారులు చాలా సీరియస్‌గా ఉన్నారు. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అధికారులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సర్వే పూర్తి కావడానికి వీలుగా యాప్‌లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. తాజా అప్ డేట్ ప్రకారం ఇంటి దగ్గరకు వెళ్లి యజమాని వివరాలు సరిచూసుకుని సిబ్బంది యాప్‌లో ఎస్ అని కొడితే సర్వే పూర్తి అవుతుంది. ఈ సర్వేలో లేని వారికి ఆ సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి పౌరులు కూడా బాధ్యతగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వేలో పాల్గొనాలని అధికారులు సూచిస్తున్నారు.

మాల ఉద్యోగులందరూ ఏకతాటిపైకి రావాలి

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాల ఉద్యోగులందరూ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. పాతగుంటూరు గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంఘాన్ని పటిష్టం చేసుకుని, ఒక శక్తివంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి అనిల్‌కుమార్ మాట్లాడుతూ మనువాదులకు, అంబేడ్కర్ వాదులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో అంతిమ విజయం అంబేడ్కర్ వాదులదేనని అన్నారు. సమాతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం మాట్లాడుతూ మాల సమాజానికి జరుగుతున్న అన్యాయాలపై చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా, నగర కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మవిశ్వాసమే నిజమైన ఆయుధం

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- ఘనంగా కమ్మ బాలికల వసతి గృహ 23వ వార్షికోత్సవాలు



ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న కమ్మ జన సేవ సమితి పాలకవర్గ సభ్యులు, పాల్గొన్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలనీ, అదే మనల్ని కాపాడుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గుంటూరు కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహం ఆవరణలో వసతి గృహం 23వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు, ఇతర రంగాల్లో ప్రతిభ చూపాలని అన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. తక్కువ మార్కులు వచ్చాయని నిరుత్సాహపడవద్దని, మార్కులు ప్రతిభకు ప్రామాణికం కాదని అన్నారు. వసతి గృహానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మరో అతిథి భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు కేజేఎస్ఎస్ అందజేస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుని ఇతరులకు సాయం చేయాలని విద్యార్థులకు సూచించారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కేజేఎస్ ఎస్‌కు అలాగే నూతన భవన నిర్మాణానికి అండగా నిలుస్తున్న నూతక్కి రామకృష్ణ దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా 516 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా జేకేసీ రోడ్డులోని నూతన భవన నిర్మాణానికి పూవ్వాడ వెంకటేశ్వరరావు, సుధా దంపతులు, అప్పారావు, శివకుమరి దంపతులు విరాళాలు అందజేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు, భాష్యం రామకృష్ణలను అలాగే విరాళాలు అందజేసిన దాతలను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని విజయ సాయి ధన్వంతరి ఆయుర్వేద వైద్యశాల, పంచకర్మ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వైద్యశాల చీఫ్ డాక్టర్ డీవీ సీతారామకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుఫిక్ కంపెనీ వారి సహకారంతో ఉచితంగా డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు యూరిక్ యాసిడ్ పరీక్షలు, డైట్ షెడ్యూల్, ఎముకల పటుత్వ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.



మెగాస్టార్ చిరంజీవి నుంచి ఔట్ స్టాండింగ్ బ్లడ్ డోనార్ అవార్డు అందుకుంటున్న జయదీప్

అవార్డు అందుకున్న జయదీప్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఔట్ స్టాండింగ్ బ్లడ్ డోనార్ అవార్డును మెగా అభిమాని యర్రగోపు జయదీప్ అందుకున్నారు. గుంటూరు నగరంలో చాలా కాలంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు కొవిడ్-19 సమయంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలను జయదీప్ నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో శనివారం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో జయదీప్‌నకు ఈ అవార్డు అందజేశారు.

సీతారామ ఆలయ భూమిపూజ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం మెయిన్‌రోడ్డు, చంద్రపురం వద్ద నిర్మిస్తున్న సీతారామ చంద్ర స్వామి వారి మందిర భూమి పూజ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. వేద పండితుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఆస్పత్రి నిర్మాణం చేపట్టండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):స్థానిక కాకుమాను వారి తోటలో వెల్ఫేర్ సెంటరులో వెంటనే ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి కోరారు. శనివారం వెల్ఫేర్ సెంటర్ వద్ద సీ పీ ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రితో పాటు మిగిలిన స్థలాన్ని వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి మృతి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ సర్జన్ గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి(95) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం తుదిశ్వాస విడిచారు. ఎన్‌వీఎస్ చౌదరి గుంటూరు వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా సేవలు అందించారు. చౌదరి భౌతిక కాయాన్ని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, పలువురు వైద్యులు సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పట్టపగలు చోరీ

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో పట్టపగలు చోరీ జరిగింది. అంకిరెడ్డిపాలెంకు చెందిన ఓ వ్యక్తి గత నెల 27న సాయంత్రం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 6 గంటలకు వచ్చి చూడగా దొంగలు తలుపు పగలకొట్టి లోపలికి వెళ్లి బీరువాను పగలకొట్టారు. అందులో ఉన్న సుమారు 10 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదంలో ఎస్సీఎస్టీ కేసు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాయపాలెం ప్లాట్స్ లో జరిగిన వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగయ్యపాలెంలో తేల ప్రదీప్‌కు ఉన్న స్థలంలో బేస్‌మెంట్ వరకు నిర్మాణం జరిగింది. అయితే భవానీ, ఆదిలక్ష్మి ,శివ అనేవారు ఈ నెల 5వ తేదీ రాత్రి ఆ బేస్‌మెంట్‌పై గోడ కట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్బారావు వెళ్లి తన స్థలంలో ఎలా కడతారని ప్రశ్నించడంతో ఆయనను కులం పేరుతో దూషించి దాడి చేసి కొట్టారు. దీనిపై ప్రదీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు దుర్గ భవానీ ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లయోలా స్కూలు వద్ద ద్విచక్రవాహనంపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన దంపతులు కాసింశెట్టి సుజాత, సాయిబాబా. తమ కుమారుడు హసన్ ఓ కేసులో అరెస్టై గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. అతన్ని చూసేందుకు ఈనెల 7న గుంటూరు వచ్చారు. అనంతరం తిరిగి తమ వాహనంపై వెళుతుండగా వెనుక కూర్చున్న సుజాతకు కళ్ళు తిరగడంతో కింద పడిపోయింది. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి సోదరుడు తోట సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసంపూర్తి రోడ్ల నిర్మాణాలు!

● ఏటీ అగ్రహారం నాల్గో లైన్, మల్లారెడ్డినగర్ మెయిన్ రోడ్డు మొదలైన చోట్ల ఇదే పరిస్థితి
● మొత్తం పనిని పూర్తి చేయాలంటున్న ప్రజలు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలుచోట్ల అసంపూర్తిగా నిర్మించిన రోడ్లు ప్రజలకు ఇబ్బందికరంగా పరిణమించాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా ఎన్నికలకు ముందు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించిన రోడ్లకు సరిగా ఎస్టిమేషన్లు వేసి శాంక్షన్లు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొంతమంది అధికారులు వీటి విషయంలో నిర్లక్ష్యం వహించారు. అదేమంటే తమకు అంతవరకే నిధులు మంజూరయ్యాయని చెప్పి ఒక రోడ్డులో 70 శాతం వరకు నిర్మించి మిగతా 30 శాతాన్ని వదిలేశారు. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేసిన రోడ్ల విషయంలో ఆశించిన సానుకూల స్పందన ప్రజల నుంచి కొరవడుతోంది.



మల్లారెడ్డినగర్ మెయిన్‌రోడ్డులో కొంత భాగం అసంపూర్తిగా వదిలేసిన నగరపాలకసంస్థ

సాధారణంగా ఏదైనా రోడ్డుని అభివృద్ధి చేయదలిస్తే తొలుత కార్పొరేటర్లు ప్రతి పాదిస్తారు. వాటికి కమిషనర్/మేయర్/స్టాండింగ్ కమిటీ/కౌన్సిల్ పరిపాలన అనుమతి వచ్చిన తర్వాత నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఫీల్డ్ సిబ్బందితో కొలతలు వేయిస్తారు. పొడవు, వెడల్పు లెక్కించి ఎస్టిమేట్లు తయారు చేస్తారు. అనంతరం టెక్నికల్ శాంక్షన్‌ని సూపరింటెండింగ్ ఇంజనీర్/చీఫ్ ఇంజనీర్/ఈఎన్‌సీ మంజూరు చేస్తారు. చిన్న వర్క్సులకు ఎస్‌ఈనే అనుమతి ఇచ్చేస్తారు. ఎక్కువ నిధులతో కూడుకున్న పనులు మాత్రం టెక్నికల్ శాంక్షన్ కోసం సీఈ/ఈఎన్‌సీ స్థాయికి వెళ్లాల్సిందే. అయితే, కార్పొరేషన్ అధికారులు పెద్ద ఎస్టిమేషన్ ఉన్న రోడ్లు, డ్రెయిన్లు ఇతర పనులను విభజించి ఇక్కడే శాంక్షన్స్ ఇస్తుంటారు.



బ్రాడీపేట నాల్గో లైనులో 10వ అడ్డరోడ్డు వరకు వెడల్పు చేసి మిగతా భాగాన్ని వదిలేసిన అధికారులు

కాగా, ఏటీ అగ్రహారంలో వీధులు చాలా పొడవుగా ఉంటాయి. దాంతో మొత్తం రోడ్డుకు శాంక్షన్ తీసుకోకుండా అరకొరగా తీసుకొని పనులు ప్రారంభించి నిధులున్నంత వరకు ఖర్చు చేసి అర్థాంతరంగా వదిలేశారు. రెడ్డి కళాశాల పక్కన ఉన్న మల్లారెడ్డినగర్ మెయిన్‌రోడ్డు, ఏటీ అగ్రహారం నాల్గో లైనులో చివర భాగం, బ్రాడీపేట నాల్గో లైనులో 10వ అడ్డరోడ్డు నుంచి చివరి వరకు అసంపూర్తిగా వదిలేశారు. నల్లకుంట, హౌసింగ్ బోర్డు, ఎన్‌జీవో కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నల్లచెరువులోనూ కొన్ని రోడ్లను సగం వరకే నిర్మించారు. దీని వలన అవి సీసా మూతల వలే మారి ట్రాఫిక్‌కి ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. ఈ విషయంపై నగరపాలకసంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదన రావుని వివరణ కోరగా కొన్ని ఏరియాల్లో సగం వరకే రోడ్లు నిర్మించి వదిలేసిన విషయం వాస్తవమేనన్నారు. వాటన్నింటిని కమిషనర్ పులి శ్రీనివాసులకు నివేదించి అనుమతులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే టెండర్లు ఖరారు చేసి పనులు మొదలు పెట్టిస్తామన్నారు.



ఏటీ అగ్రహారం నాల్గో లైను చివర ఎంఎన్‌ఆర్ కన్వెన్షన్ వద్ద నిర్మించకుండా వదిలేసిన రోడ్డు

10న పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లో ఈనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలోని (ప్రభుత్వ, ప్రైవేటు) పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు మందులు పంపిణీ చేయాలని డీఈవో సీవీ రేణుక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

అనధికారిక కట్టడాలు జరగకుండా పర్యవేక్షించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కట్టడాలు నిర్మాణం జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా శనివారం స్థానిక వికాస్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, కొరిటెపాడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికార కట్టడాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణం చేసుకునే వారు ప్లాన్‌కి దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. బహుళ అంతస్తు భవనాలకు ఓసీ వచ్చే వరకు వేచి ఉండకుండా నివాసం ఉండే ప్లాట్‌లకు పన్ను విధించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఆర్ఓ మదన్ గోపాల్, ఏసీపీ రెహ్మాన్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, నిర్వాహకులు రామ్మోహనరావు తదితరులు

చేతిరాత పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో చేతి రాత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బహుతులు సాధించిన విద్యార్థులను ఉర్దూ డీఐ ఎస్‌కె ఎండీ ఖాసిం శనివారం అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వీరామ్మోహనరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు(విద్య), ఆంధ్రజ్యోతి

కానిస్టేబుళ్ల నైపుణ్యాలకు మెరుగులు: ఎస్పీ సతీష్‌కుమార్



కానిస్టేబుల్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుళ్ల నైపుణ్యాలకు మెరుగులు దిద్దడమే మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. మానవ వనరుల అభి వృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లు శని వారం అందజేశారు. జిల్లా పోలీస్ కార్యా లయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల నుంచి 30 మంది కానిస్టేబుళ్లకు ఆరు రోజులు పాటు, ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ శిక్షణ పొందిన 30 మంది కానిస్టేబుళ్లు తమ శిక్షణా కాలంలో తమకు తెలిసిన విషయాలపై మరింత లోతుగా అవగాహన చేసుకున్నారన్నారు.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

● కోర్టు కానిస్టేబుళ్ళతో సమావేశంలో సీసీఎస్ అదనపు ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సుప్రజ

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సంబంధించి వివిధ న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని, సీసీఎస్ అదనపు ఎస్పీ కే సుప్రజ ఆదేశించారు. ఈ మేరకు శనివారం పోలీస్ కార్యా లయంలో కోర్టు కానిస్టేబుళ్ళతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రక్రియకు సంబంధించి తగు ప్రణాళికలు రూపొందించి, సంబంధిత పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

ఆన్‌లైన్ షేర్ల పేరిట రూ. 49 లక్షల మోసం

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో షేర్ల వ్యాపారంలో పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయంటూ నమ్మించి రూ 49 లక్షలు మోసం చేసిన ఘటనపై అరండల్ పేట పోలీస్‌స్టేషన్ లో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. స్థానిక భారత్ పేట మూడో లైన్‌కి చెందిన గరికపాటి నవీన్ ఓ ప్రైవేట్ ఫార్మా కంపెనీలో పని చేస్తుంటాడు. ఆన్‌లైన్‌లో అలియాంజ్ అనే సంస్థలో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించడంతో, నవీన్ మొదటగా రూ. 50 వేలు పెట్టుబడి పెట్టాడు. లాభం వచ్చినట్లుగా చూపగా, మరికొంత పెట్టుబడి పెట్టాడు. ఆశ కల్పిస్తూ నవీన్ తో 48 లక్షల 25 వేల 200 పెట్టుబడి పెట్టించారు. ఆ మొత్తం డ్రా చేసుకోనివ్వకపోవడంతో అనుమానం వచ్చిన నవీన్ నిలదీశాడు. తన ఖాతాలో కేవలం రూ.2లక్షలు ఉండటం గమనించి మోసపోయానని తెలుసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ కార్యాలయంలో ప్రజాదర్బార్
● వందకుపైగా అర్జీల సమర్పణ



సమస్యలను వింటున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కా రానికి వేదికగా మారింది. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కొలిక్కిరాని సమస్యలకు ఒక సమాధానం దొరి కింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. 'అధైర్య పడొద్దు, అండగా ఉంటాం' అని అర్జీలు సమర్పించిన వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌లో సుమారు వంద మందికిపైగా తమ సమస్యలను నివేదించారు. గత ప్రభుత్వంలో అన్యాయంగా పెన్షన్లు, రేషన్ కార్డు తొలగించారని, తిరిగి ఇప్పించాలని ఒకరు, తమ కాలనీలో రోడ్లు లేక ఇబ్బందిపడుతున్నామని మరొకరు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కా రానికి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తోందని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించినట్లు చెప్పారు. ఇటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూనే, మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామన్నారు.

శాసనమండలిలో నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషిస్తాం

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు
● ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రేపు నామినేషన్



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు, పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు తదితరులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో నిర్మాణాత్మక ప్రతి పక్షంగా ఉంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సమస్యల పరి ష్కారమే ధ్యేయంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము పనిచేశామని, రాజ్యాంగ విలువలు, నిబ ద్ధత, నిజాయితీకి ఎప్పుడు కట్టుబడి ఉన్నామని ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు స్పష్టం చేశారు. కృష్ణా, గుం టూరు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఈ నెల 10న నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా శనివారం స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు, కొండవీడు కోటను పర్యాట కేంద్రంగా అభివృద్ధి చేయడం, జీజీహెచ్‌లో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు వంటివి పీడీఎఫ్ ఎమ్మెల్సీగా తాను చేసిన అభివృద్ధికి నిదర్శన మన్నారు. జిల్లాలో కౌలు రైతుల సమస్యలు, వరిక పూడిసెల ఎత్తిపోతల పథకం, గుం టూరు ఛానల్ పొడిగింపు వంటి సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని వివరిం చారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్, ఆశవర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేసినట్లు తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ,పెన్షనర్స్, ప్రజాసంఘాలు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తా మని తెలిపారు. అనంతరం వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నటు తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం. హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యూ రాజశేఖర రావు, ఎం.కళాధర్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'బీజేపీ విజయం వెనుక చంద్రబాబు ప్రచారమే కీలకం'

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయం వెనుక విజన్ ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రచారమే కీలకపాత్ర పోషించిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రచారంతో అక్కడ విజయ బావుటా ఎగరవేసిందని చెప్పారు. ఢిల్లీలోని చాదర్, విశ్వాస నగర్ , సంఘం విహార్, సవద్ర నియోజకవర్గాల్లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేశారని తెలిపారు. ఆయన ప్రచారం అక్కడి తెలుగు వారిపై ప్రభావం చూపిందన్నారు. బీజేపీ వలన లభించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారని, ,అదేవిధంగా ఆప్ పార్టీ వల్ల జరిగిన నష్టాన్ని తెలిపారని చెప్పారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాస్పైడర్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 54 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. కంపెనీ ఉచిత శిక్షణ అందిస్తూ, ప్రతిభ ఆధారంగా రూ. 9.5 లక్షల వార్షి ప్యాకేజీతో ఉద్యోగాలు కల్పిస్తుందని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ అభినందించారు.

నేడు జేసీకేవీఎన్ డిగ్రీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో ఆదివారం సిల్వర్ జూబ్లీ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి పాల్గొంటారని తెలిపారు.

'కాసరనేని' సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల



ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు డాక్టర్ కాసరనేని పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యంతో పాటు, ఆర్థిక తోడ్పాటును అందించిన కాసర నేని సదాశివరావు సేవలు చిరస్మరణీయమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్న మయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివ రావు కళాసమితి ఆధ్వర్యంలో 13వ నాటకోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సభకు సంస్థ చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. నరేంద్ర కుమార్‌కు డాక్టర్ కాసరనేని సదాశివరావు ఆత్మీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి వీరయ్య చౌదరి, సదాశివరావు నుంచి నైతిక విలువలను నేర్చుకున్నానని అన్నారు. కాసరనేని పురస్కారం అందుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు. కాసరనేని ఆలోచనలను ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు. పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. సభానంతరం కాకినాడ శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్, మార్కొండ దుర్గాప్రసాద్ రచించిన, చట్రా విజయ లక్ష్మీ మహేష్ దర్శ కత్వం వహించిన 'దేవుడు కనిపించాడు' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ పాతూరి కిరణ్ చౌదరి, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఘంటా పున్నారావు, పొన్నూరు కళాపరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, కళా సమితి సభ్యుడు యర్రా ఈశ్వరరావు, సంస్థ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.



'దేవుడు కనిపించాడు' నాటికలో ఓ సన్నివేశం



ఎస్‌యూవీ కారును విడుదల చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, ఎండీ రాకేష్, మన్నవ మోహనకృష్ణ తదితరులు

సరికొత్త మహీంద్ర ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ విడుదల

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహీంద్ర ఎలక్ట్రిక్ ఒరిజిన్ ఎస్‌యూవీ కారును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు శనివారం లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. స్థానిక జేకేసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహీంద్ర కంపెనీ భారతదేశంలోనే ఉన్న కంపెనీ అని, ప్రజలు స్వదేశీ కంపెనీలను ఆదరించాలని కోరారు. ప్రస్తుత ఆధునిక యుగంలో అందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తేవటం అభినందనీయమన్నారు. పయనీర్ సంస్థల మేనేజింగ్ డైరక్టర్ చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ నేటి నుంచి కార్ల కొనుగోలుకు బుకింగ్స్ ప్రారంభమైనట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు టెస్ట్ డ్రైవ్ చేయవచ్చన్నారు. విభిన్న రంగుల్లో కార్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.

రాజోలు, పాలకొల్లులో విద్యార్థులకు

నేడు ఉపకారవేతనాల పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, ది రాజోలు తాలూకా తెలగా అఫిషియల్ అసో సియేషన్-రాజోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 242 మంది పేద విద్యార్థులకు రూ. 10 లక్షల 33వేలు ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నట్లు తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ.5 లక్షల 25 వేలు తులసి సీడ్స్ వారి 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా 104 మంది పేద విద్యార్థులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజున 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ - గుంటూరు', ' శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం- పాలకొల్లు' వారి సంయుక్త ఆధ్వ ర్యంలో ప్రతిభ పురస్కారాలలో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కన బరిచిన 282 మంది పేద విద్యార్థులకు రూ.12 లక్షల 90వేలను ఉపకారవేతనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

బీ జే పీ కార్యాలయం వద్ద సంబరాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీ జే పీ విజయకేతనం ఎగరవేసిన సందర్భంగా జిల్లా కార్యాలయంలో వద్ద ఆ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేశారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఢిల్లీ అభివృద్ధి చెందుతుందని డబల్ ఇంజన్ సర్కార్ కోసం ప్రజలు కమలం గుర్తుకు ఓటేసి బిజెపిని గెలిపించుకున్నారని అన్నారు.

ఆ రోడ్లు ఆర్ అండ్‌బీవికావు: ఈఈ విశ్వనాథరెడ్డి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోని హౌసింగ్ బోర్డు నుండి రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డు ఆర్ అండ్ బీ పరిధిలోకి రావని ఈఈ సీ విశ్వనాథ రెడ్డి తెలిపారు. గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు నుంచి హైవే కు వెళ్లే బైపాస్ రోడ్డు కూడా తమ పరిధిలో లేదని తెలిపారు. జిల్లాలో ఆర్ అండ్ బీ కి చెందిన రోడ్లపై ఉన్న గుంతలను గుర్తించి వాటిని చాలా వరకు పూడ్చడం జరిగిందని తెలిపారు. ఆర్ అండ్ బీ కి చెందిన పనుల గుర్తింపు లో తాము అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటివరకు 85 శాతం రోడ్డు పనులు పూర్తయ్యాయని వెల్లడించారు.



గుండెకు గోల్డెన్ అవర్!

● ఏరియా వైద్యశాలలో ఉచితంగా టెనెట్+ ఇంజక్షన్‌లు

● అందుబాటులోకి స్టెమీ ప్రాజెక్టు

● గుండెపోటుతో ప్రాణం పోకూడదనేదే లక్ష్యం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా యుక్త వయస్సులోనూ గుండెపోటుకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూనే హృదయానికి రక్షణగా నిలిచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గుండెపోటుతో ఎవరూ మరణించకూడదనే లక్ష్యంతో స్టెమీ ఇంజక్షన్‌కు శ్రీకారం చుట్టింది. రక్తనాళం పూడిపోయిన సందర్భంగా వచ్చే తీవ్ర గుండె నొప్పిని స్టెమ్మి అంటారు. దీనికి రక్షణగా చికిత్స అవసరం. బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఏరియా వైద్యశాలలో స్టెమీ ప్రాజెక్టు పేరుతో గోల్డెన్ అవర్ చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. ఎటువంటి గుండె నొప్పి వచ్చినా గంటలోపు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తే బాధితుడికి రూ.45 వేలు విలువైన టెనెట్+ అనే ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నారు. ఇంజక్షన్ వేశాక బ్లాక్ అయిన రక్తనాళం తెరుచుకొని బాధితుడి ప్రాణాలను కాపాడుతుంది. తరువాత రెండు నుంచి మూడు గంటల సమయం లభిస్తుందనీ, దీంతో పెద్ద ఆస్పత్రికి వెళ్లి గుండె ఆపరేషన్ చేయించుకొని ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 36 మందికి ఇంజక్షన్‌లు ఇచ్చారు. వీరిలో 34 మంది ప్రాణాలు కాపాడారు.

టెలీ మెడిసిన్ ద్వారా చికిత్స

ఛాతీ నొప్పి, శ్వాస సక్రమంగా ఆడకపోవటం, చెమటలు పట్టడం, వికారం, వాంతులు అవ్వటం వంటి లక్షణాలు గుండె నొప్పికి కారణాలుగా చెపుతారు. ఈ లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆక్సిజన్ పెట్టి ఈసీజీ తీస్తారు. దీనిని యాప్ ద్వారా జిల్లా ఆస్పత్రికి పంపుతారు. అక్కడ ఉన్న గుండె వ్యాధి నిపుణులు పరిశీలించి స్టెమీ ఐతే టెనెట్+ ఇంజక్షన్ సిఫార్స్ చేస్తారు. లేదంటే ఈసీజీ రిపోర్టుకు తగ్గట్టుగా మందులు, ఇంజక్షన్‌లు వేయాలని సూచిస్తారు.



గుండెపోటు బాధితులకు ఇచ్చే ఇంజక్షన్


ఉచితంగా అందిస్తున్నాం



గుండెపోటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే బాధితుల ప్రాణాలను కాపాడేందుకు రూ.45 వేలు విలువైన ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

- డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అవగాహన అవసరం



స్టెమీపై అవగాహన లేకపోవటంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి బ్లాకేజ్‌తో ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యులు టెనెట్+ ఇంజక్షన్ చేయాలని చెపుతున్నా నిరాకరిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి తిరిగి ఇదే ఇంజక్షన్‌ను రూ.45 వేలు ఇచ్చి చేయించుకుంటున్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాం.

- డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి)

వాసవీ పీఠాధిపతి.. తెనాలివాసే

● శనివారం పెనుగొండలో పట్టాభిషేకం

● బాధ్యతలు స్వీకరించిన ప్రజ్ఞానంద సరస్వతి

● రెండో పీఠాధిపతిగా అరుదైన గౌరవం



అఖిల భారత శ్రీ వాసవీమాత పెనుగొండ క్షేత్రం

తెనాలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శ్రీ వాసవీమాత పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) తెనాలి వాసే. దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు ఆరాధ్య దైవమైన వాసవీ మాత పీఠం పెనుగొండలో ఉంది. దీనికి తెలుగు రాష్ట్రాలే కాకుండా, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, మరికొన్ని ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల నుంచి ప్రతినిధులున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఈ ట్రస్టుకు సారథ్యం వహిస్తుంటే, దీనికి తెనాలికి చెందిన బాలస్వామిని ఎంపిక చేయటం, శనివారం పట్టాభిషేకం చేయటంతో తెనాలిలో పండుగ వాతావరణం నెలకొంది. వాసవీ పీఠానికి తొలి అధిపతిగా శ్రీ కృష్ణానందపురి స్వామీజీ 16 ఏళ్లపాటు ఉన్నారు. గతేడాది ఆయన శివైక్యం చెందటంతో ఆయన స్థానంలో పీఠాధిపతి బాధ్యతలను అప్పగించేందుకు అప్పటి నుంచి అన్వేషణ జరుగుతూనే వచ్చింది. అయితే తెనాలికి చెందిన బాలస్వామిని ఎట్టకేలకు ఎంపికచేశారు. దీంతో తెనాలికి అరుదైన గౌరవం దక్కటంతో అందరిలోనూ సంతోషం వ్యక్తమవుతోంది. తెనాలి పట్టణానికి చెందిన బొలిశెట్టి నరసింహారావు, రాజ్యలక్ష్మి దంపతులకు బాలస్వామి 1989లో జన్మించారు. ఈయన అసలు పేరు బొలిశెట్టి వెంకట ప్రదీప్ శ్రేష్టి. ఆయన విద్యాభ్యాసం స్థానిక తాలూకా ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు సాగింది. ఆ తర్వాత శ్రీవిద్యాపీఠంలో ఆధ్యాత్మిక జీవితం మొదలై, వేద పఠనం ప్రారంభించారు. ఆ తర్వాత నైమిశారణ్యంలో శ్రీ ఆనందానంద సరస్వతి స్వామీజీ సన్నిధిలో సన్యాసదీక్ష తీసుకున్నారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతనతోనే అడుగులు వేస్తూ వచ్చారు. చాలాకాలంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక బోధ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీ విద్యా పీఠం, శ్రీ సాలగ్రామ మఠం వంటివాటి ద్వారా అద్వైత, ఉపనిషత్తుల సారాన్ని వివరిస్తూ వాసవీ మాత అనుగ్రహం పొందిన వారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇవన్నీ ఆయనను వాసవీ పీఠానికి అధిపతిని చేశాయి. తెనాలి-బుర్రిపాలెం రోడ్డులో సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించే పని మొదలు పెట్టారు. ఇంతలోనే ఆయనను పీఠాధిపతిగా నియమించటంతో తెనాలికి మంచి గుర్తింపు వచ్చినట్టయింది. ఆయన పట్టాభిషేకానికి తెనాలి నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవీ మాత భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

ఆలపాటి.. ధూళిపాళ్ళ మధ్య సయోధ్య?

● నరేంద్రకు ఫోన్ చేసి మద్దతు కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజా

● రెండు, మూడు రోజుల్లో ఇద్దరి సమక్షంలో పొన్నూరులో సమావేశం



మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన చిరకాల ప్రత్యర్థి అయిన పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌తో సయోధ్య కుదుర్చుకున్నట్లు సమాచారం. వీరిద్దరూ ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరాటం ఉంది. రాజా నేతృత్వంలోని ఓ వర్గం సంగం డెయిరీపై ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారనే గుర్రుతో నరేంద్ర రాజాకు దూరంగా ఉంటూ వచ్చారు. దీంతో ఇద్దరూ పార్టీకి వీరవిధేయులుగా ఉన్నప్పటికీ స్వపక్షంలో విపక్షీయులుగానే వ్యవహరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో తెనాలి సీటు జనసేనకు కేటాయించటంతో ఇన్‌చార్జిగా ఉన్న రాజా సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. సీటు దక్కనప్పటికీ తెనాలిలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గెలుపు కోసం పట్టుదలతో పనిచేసి పార్టీ సుప్రీం చంద్రబాబు మెప్పు పొందారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పార్టీ తరపున రాజాకు చంద్రబాబు కల్పించారు. ఆయన ఇప్పటికే గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పరిధిలోని 33 నియోజకవర్గాల్లో ఒక్క పొన్నూరు మినహా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడం వల్లే ఆలపాటి ఆ నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. రెండు రోజుల క్రితం కృష్ణా జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇదే అంశంపై నరేంద్రతో మాట్లాడేందుకు పొన్నూరు వెళ్లగా ఆయన స్థానికంగా లేరు. ఈ పరిస్థితుల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా నరేంద్రకు రాజానే రెండు రోజుల క్రితం ఫోన్ చేసి మద్దతు కోరినట్లు తెలిసింది. అంతేకాకుండా శుక్రవారం జరిగిన తన నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారని సమాచారం. కుంభమేళాలో ఉన్న తాను కార్యక్రమానికి హాజరు కాలేనని రాజాకు నరేంద్ర చెప్పినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో పొన్నూరు వచ్చాక కార్యకర్తలతో చర్చించి ఆలపాటి గెలుపు కోసం సమావేశం ఏర్పాటు చేసేందుకు నరేంద్ర సన్నద్ధమవుతున్నట్టు తెలిసింది. పార్టీకి వీర విధేయుడుగా ఉండే ధూళిపాళ్ల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు వ్యక్తిగత ద్వేషాలను పక్కన పెట్టాలనే నిర్ణయానికి రావడంతో ఆలపాటి వర్గీయులు కూడా సంతోషంలో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యమా అని ఒకే వేదికపై కలిసి ఆలపాటి, ధూళిపాళ్ల ప్రసంగించనున్నారు.

సంకల్ప బలంతోపాటు నిజాయితీ ఉండాలి

● సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ)

● విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన మహోత్సవ్



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు..



మాట్లాడుతున్న సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ)

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి సంకల్ప బలంతో పాటు నిజాయితీ ఉండాలని సినీ దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్ రవీంద్ర (బాబీ) మాట్లాడుతూ జీవితంలో ముందుకు వెళ్లాలంటే అల్లరితో పాటు క్రమశిక్షణ ఉండాలన్నారు. ఇష్టమైన రంగంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. యువత సంకల్పంలో నిజాయితీ ఉంటే అనుకున్నది తప్పకుండా జరుగుతుందన్నారు. జీవితంలో మొదటగా మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని 2024 పారాఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ అన్నారు. విజ్ఞాన్స్ మహోత్సవ్ ద్వారా విద్యార్థులకు నూతన అనుభవం పొందే అవకాశం లభించిందని వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ నేర్చుకోవడం, వివిధ కళా, సాంకేతిక రంగాలలో మెరుగుదల, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర కళాశాల విద్యార్థులతో ఇంటరాక్షన్ పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక కళారంగాల్లో విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాబీ, పారా షూటర్, అర్జున అవార్డు గ్రహీత రుబినా ఫ్రాన్సిస్

ఆచరణాత్మక కృషితో అద్భుత విజయాలు

● డాక్టర్ కొంగర రవికాంత్

● భాష్యం బ్లూమ్స్‌లో ముగిసిన సాంస్కృతిక కళా ఉత్సవాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనలకు ఆచరణాత్మక కృషి తోడైతే జీవితంలో అద్భుత విజయాలు సాధిస్తారని ప్రముఖ వైద్యులు, గ్యాస్ట్రో అండ్ బెరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కొంగర రవికాంత్ అన్నారు. భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో హరాప్లా పేరుతో నిర్వహిస్తున్న సాంస్కృతిక వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులపై తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణతో విద్యార్థులు మెలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ చదువు నేర్పిన గురువుల్ని, తల్లిదండ్రుల్ని గౌరవించాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు ప్రసంగిస్తూ విద్యార్థుల ఉన్నతికి భాష్యం సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ తమ సంస్థల్లో చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, కళారంగాలకు పెద్దపీట వేసి విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీస్తామన్నారు. భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, జడ్పీ ఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కొంగర రవికాంత్



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కేవలం సంక్షేమాన్ని నమ్మినందుకే ఢిల్లీలోనూ ఏపీ ఫలితాలు

● లోక్‌సభలో టీడీపీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

గుంటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని వదిలేసి కేవలం సంక్షేమాన్ని నమ్ముకుంటే ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో ఏం జరిగిందో ఢిల్లీలోనూ అదే జరిగిందని లోక్‌సభలో టీడీపీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. గుంటూరులో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారానికి వెళ్ళిన సమయంలో తాను అక్కడ నీటి సమస్యను స్వయంగా చూశానన్నారు. రైల్వే బడ్జెట్‌లోనూ గతంలో కంటే పది రెట్లు అదనంగా ఏపీకి దక్కాయన్నారు. రాష్ట్రంలో అన్ని అనుమతులు పొందిన ఏకైక ప్రాజెక్టు వరికపూడిశెల అన్నారు. రైతు భరోసా 2018 వరకు కటాఫ్ అని ఇప్పటికే ప్రకటించారని దీనిపై తాను లోక్‌సభలో కూడా మాట్లాడినట్లు ఎంపీ చెప్పారు.

పెంచకపోగా.. కుదింపా?

(5వ పేజీ తరువాయి)

రైళ్లు, సండ్రీస్ ద్వారా వచ్చే ఆదాయం పైనే ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంటున్నది. గుంటూరు రైల్వే డివిజన్‌కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నెలాఖరు వరకు రూ.466.21కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ప్రయాణికుల టిక్కెట్ చార్జీల రూపంలో రూ.171.55కోట్లు వస్తే 2.77 మెట్రిక్‌టన్నుల సరుకు రవాణాకు రూ.299 కోట్ల ఆదాయం వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 64.1 శాతం ఆదాయం సరుకు రవాణా ద్వారానే గుంటూరు రైల్వే డివిజన్‌కు వచ్చింది. జొన్న, డెక్కన్ సిమెంట్స్ నుంచి క్లింకర్, సిమెంట్ లోడింగ్ నిలిచిపోయినా ఈ ఆదాయాన్ని ఆర్జించింది. సండ్రీస్ రూపంలో రూ.16.87 కోట్లు వచ్చింది.

తెలంగాణ పరిధిలోనే లోడింగ్ స్టేషన్లు..

ఇప్పటి వరకు గుంటూరు డివిజన్ పరిధిలో మేజర్ లోడింగ్ స్టేషన్లుగా చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ, విష్ణుపురం, నడికుడి ఉన్నాయి. పొందుగుల, రెడ్డిపాలెం గూడ్స్ షెడ్డు, నరసరావుపేట, నంద్యాల, జాన్‌పహాడద్, నల్లపాడు(ఆర్ఎం సీ), శావల్యాపురం(ఆర్ఎం సీ), వినుకొండ, దొనకొండలోనూ ఫుల్ రేక్ లోడింగ్‌కు అవకాశం ఉన్నది. అయితే వీటిలో సరుకు దిగుమతి తప్ప బయటకు వెళ్లేది చాలా తక్కువ. ఇవికాక విష్ణుపురంలో ఇండియా సిమెంట్స్ సైడింగ్, జాన్‌పహాడ్‌లో పెన్నా సిమెంట్స్ సైడింగ్, డెక్కన్ సిమెంట్ సైడింగ్‌లున్నాయి. నల్గొండ, మిర్యాలగూడలో ఎఫ్‌సీ, మిర్యాలగూడలో మ్యాట్రిక్స్ వేర్‌హౌసింగ్ సైడింగ్స్ ఉన్నాయి. ప్రైవేటు ఫ్రైట్ టెర్మినల్ కూడా ఒకటి ఉన్నది. కంటైనర్ రైల్ టెర్మినల్ గుంటూరులో ఉన్నది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సరుకు రవాణా జరిగే ప్రదేశాలన్నీ తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయి. కొత్తగా విష్ణుపురం వద్ద యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్‌కు బొగ్గు దిగుమతి అధికంగా జరుగుతోంది. ఇప్పుడు సరుకు రవాణా వచ్చే సెక్షన్ మొత్తాన్ని దక్షిణమధ్య రైల్వేలోనే కొనసాగిస్తూ సికింద్రాబాద్ డివిజన్‌లో చేర్చడానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఇదే జరిగితే ఇక గుంటూరు డివిజన్‌కు మిగిలేది నడికుడిలో చెట్టినాడ్ సిమెంట్స్ క్లింకర్ లోడింగ్ మాత్రమే. దానివల్ల ప్రస్తుతం కోల్పోబోతోన్న ఆదాయంలో 10శాతం కూడా భర్తీకాదు. ఇక ప్రత్యామ్నాయంగా నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం ద్వారా సరుకు రవాణాని పెంచుకోవాలి. అది జరగాలంటే ఈ రైలు మార్గం పూర్తికావాలి. ప్రస్తుతం భూసేకరణ సమస్యని ఈ రైలుమార్గం ఎదుర్కొంటోంది. ఒకవేళ ఇది పూర్తైతే నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటి వస్తుంది. అప్పుడు ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది. అలానే మిర్చిరవాణా విషయంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అప్పుడే లోటుభర్తీ జరిగి డివిజన్‌కి పూర్వవైభవం వస్తుంది.

నాలుగో తరగతి ఉద్యోగులపై చులకన భావన విడనాడాలి

● రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రత్నకుమార్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల పట్ల మండల స్థాయిలో అధికారులు, సిబ్బంది చూపిస్తున్న చులకనభావన విడనాడాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జి.రత్నకుమార్, జనరల్ సెక్రెటరీ ఎన్ రాజేష్‌ప్రభుకుమార్ పేర్కొన్నారు. శనివారం గుంటూరు జిల్లా పరిషత్ కాంపౌండ్‌లోని పీఆర్ క్లాస్ ఫోర్ యూనియన్ భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు ప్రసంగించారు. నాలుగో తరగతి ఉద్యోగుల సీనియారిటీ జాబితా తయారుచేయమని జిల్లా పరిషత్ అధికారులను ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం ఉండటం లేదన్నారు. యూనిఫామ్ అలవెన్స్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కో-ఆప్టెడ్ మెంబర్ ఎస్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు లక్ష్మయ్య, గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.ఆర్.అంబేద్కర్, ట్రెజరర్ షేక్ పెదబాబు సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ క్లాస్ ఫోర్ యూనియన్ రాష్ట్ర నేతలు

వ్యాసభగవానుడు అందించిన మహత్తర కావ్యం భారతం

● పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు

● ప్రారంభమైన ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తాను పొందిన అనుభూతిని లోకానికి అందించాలని సత్‌సంకల్పంతో మహాభారత కావ్యాన్ని వ్యాసభగవానుడు రచించారని మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురం శ్రీ రమాసత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం మహాభారత యుద్ధంలో భగవంతుని పాత్ర అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం చేస్తూ వ్యాసభగవానుడి జీవితం మనకు ఆదర్శమన్నారు. భారతంపై ప్రవచనం చేసే ముందు వ్యాసభగవానుని అనుమతి పొందటం క్షేమకరమన్నారు. ఏ పురాణాలు ఉన్నా వానిలోని సారాంశాన్ని జీవితానికి అన్వయించుకోవడం ఉత్తమమన్నారు. కష్టాలుపడ్డవారికి సుఖాలు ప్రాప్తిస్తాయని చెప్పిన మహత్తర కావ్యం భారతమేనన్నారు. మహాభారత యుద్ధం సభాపర్వంలోనే ప్రారంభమైందని తెలిపారు. ఓర్పు, సహనం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, భారత యుద్ధంలో గెలవడానికి పాండవులు 14 ఏళ్లు వేచి ఉన్నారని అన్నారు. దుఃఖాన్ని ఇతరుల వద్ద పంచుకోవద్దని సూచించారు. మాయలో పడకుండా భారతం నేర్పుతుందని అన్నారు. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం మన ఆధ్యాత్మిక సమానత్వమన్నారు. అన్ని కులాలు సమానమేనని లోకానికి తెలిపేది సత్యనారాయణస్వామి కథేనన్నారు. కార్యక్రమాన్ని ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆది, సోమవారాల్లో కూడా ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు.



ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికపాటి నరసింహారావు, హాజరైన భక్తులు

పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 1818 క్యూసెక్కులను శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 156 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 142, పశ్చిమ కాల్వకు 125, నిజాంపట్నం కాల్వకు 80, కొమ్మమూరు కాల్వకు 870 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో వారం రోజులుగా జరుగుతున్న 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం వెంకటేశ్వరస్వామికి తిరుమంజనం (అభిషేకం) అష్టోత్తర శతనార్చన, తీర్థ ప్రసాద గోష్ఠి, వేదాశీర్వాచన కార్యక్రమాలు నిర్వహించారు. చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

10న లక్ష్మణరావు నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు

పెదనందిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పోటీచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు 10న గుంటూరులో నామినేషన్ వేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు విజ్ఞప్తి చేశారు. శనివారం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం నేత కొత్త వెంకట శివరావు అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ వామపక్ష పార్టీల ప్రజా సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పోటీ చేస్తున్నారని, ఆయనను గెలుపు ప్రజల గెలుపని అన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో సభ జరుగుతుందని, అనంతరం అక్కడి నుంచి కలెక్టరు కార్యాలయం వరకు భారీ ప్రదర్శనగా వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నేత దొప్పలపూడి రమేష్ బాబు, విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నేతలు గారపాటి రమేష్, జంపని రామారావు, తలారి కిషోర్, మహిళా సంఘం నాయకులు మర్రి లక్ష్మి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

స్పిరిచ్యువల్ సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పెదనందిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో బాల త్రిపుర సుందరీ సమేత శ్రీసోమేశ్వర స్వామి ఆలయము శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయాల అభివృద్ధి కమిటీ. స్పిరిట్యువల్ సొసైటీ ఆఫ్ పెదనందిపాడు నూతన కమిటి ప్రమాణ స్వీకారోత్సవం వేడుకలు శనివారం రాత్రి స్థానిక సోమేశ్వర స్వామి వారి మండపంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు రాష్ట్ర ధార్మిక సంఘ చైర్మన్ ప్రముఖ సిద్ధాంతి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, విశ్రాంత ప్రిన్సిపాల్ పొన్నూరు బాలకుటుంబరావుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతనకమిటీ అధ్యక్షురాలిగా మాజీ ఎంపీపీ ముద్దన నగరాజుకుమారి, సెక్రటరీగా తడవర్తి సురేష్‌బాబు, కోశాధికారిగా దాసరి లక్ష్మీ శివరామ ప్రసాదు, గౌరవ అధ్యక్షులుగా దాసరి శేషగిరిరావులతోపాటు మరో 66 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి



వేణుగోపాల స్వామి ఆలయంలో వికాస్ తరంగిని ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకొని వికాస తరంగిణి బృందం వారు వేద పండితులు వేదాంతం తిరుమలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

● ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పని హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మధు పవన్ తెలిపారు. గుంటూరు పర్చూరు రహదారిలో శనివారం చిలకలూరిపేట రహదారిలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

రీ-సర్వే రైతుల పాలిట శాపం

● భూ విస్తీర్ణాల్లో మార్పులు
● భూ హెచ్చు తగ్గులుంటే సరిపుచ్చుకోవటమే
● ఆందోళనలో రైతులు
● కొనసాగుతున్న రీ-సర్వే



లచ్చన్నగుడిపూడి గ్రామంలో రీ-సర్వే చేస్తున్న సిబ్బంది

తాడికొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): భూముల రీ-సర్వే రైతుల పాలిట శాపంగా మారనుందా? అనేది రైతుల గుండెల్లో ప్రశ్నార్థకంగా ఉన్నది. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీ-సర్వే తప్పుల తడగా మారిందని రైతులు ఒక పక్క గగ్గోలు పెడుతుంటే, మరో పక్క కూటమి ప్రభుత్వం దానిని సరిచేసే పనిలో నిమగ్నమైంది. అయితే ఈ రీసర్వేలో భూ విస్తీర్ణాల్లో మార్పులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో జనవరి 20 నుంచి భూముల రీ-సర్వే చేస్తున్నారు. అధికారులు ఈనెల 20 తర్వాత ఏ రైతుకు ఎంత భూ విస్తీర్ణం ఉందన్న విషయాన్ని తెలియజేస్తారు. ఆ వివరాల ప్రకారమే రికార్డును భద్రపరుస్తారు. అయితే ఆయా రికార్డుల్లో భూమి హెచ్చు తగ్గులు వస్తే రైతులు మండల సర్వేయర్‌కు అప్పీల్ చేసుకోవాలని, అప్పుడు మరో మారు భూ సర్వే చేస్తారని అధికారులు చెబుతున్నారు. మండల సర్వేయర్ సమక్షంలో సర్వే అనంతరం కూడా తమ భూమి విస్తీర్ణం తగ్గితే తమ పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ వద్ద ఉన్న భూమి రికార్డు ప్రకారం కాకుండా పొలం తగ్గితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పక్కాగా రీసర్వే చేపడితేనే బాగుటుందని రైతులు కోరుకుంటున్నారు.



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న సర్వే సిబ్బంది, వీఆర్‌వోలు

బలమైన సైబర్ భద్రతా చట్టాలు అవసరం

● విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు
● వీఐటీ ఏపీలో జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్




వీఐటీలో జరిగిన హ్యాకథాన్ ఎక్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు

తుళ్లూరు, (ఐనవోలు) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేగవంతమైన డిజిటల్ పరివర్తనతో సైబర్ బెదిరింపులు మరింత అధునాతనంగా మారాయని ఇలాంటి పరిస్థితుల్లో భద్రతా సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడానికి బలమైన సైబర్ భద్రతా చట్టాల ఆవశ్యకత ఎంతో ఉందని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు అన్నారు. నేషనల్ సైబర్ భద్రతా పరిశోధన మండలి డిల్లీ (ఎన్‌సీఎస్‌సీఆర్), ఏఐసీటీఈ సహకారంతో వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. సమాచార భద్రత రంగంలో వినూత్న పరిష్కారాలపై చర్చించటానికి సైబర్ భద్రతా ఔత్సాహికులు, నిపుణులు, విద్యావేత్తలు ఈ హ్యాకథాన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేకర్‌బాబు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడంలో వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ప్రశంసించారు. గౌరవ అతిథి షేక్ అహ్మద్ (ఎన్సీఎస్సీఆర్, ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ గౌరవ సలహాదారు, న్యూఢిల్లీ) మాట్లాడుతూ సైబర్ స్థితిస్థాపకతను బలోపేతం చేయడంలో సహకార ప్రయత్నాల ప్రాముఖ్యతను తెలియజేశారు. సైబర్ సెక్యూరిటీ అనేది వ్యక్తిగత ప్రయత్నం కాదని, అదొక సమష్టి బాధ్యత అని అన్నారు. సురక్షితమైన డిజిటల్ భవిషత్‌ను నిర్మించే దిశగా ఒక అడుగు ముందుకు వేయడానికి ఈ హ్యాకథాన్ ఉపయోగ పడుతుందన్నారు. డాక్టర్ ఖలీ రాజ్ (డైరెక్టర్ నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్) మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ భవిష్యత్తును రూపొం దించగల సంచలనాత్మక ఆలోచనలకు ఈ హ్యాకథాన్ ఒక వేదికగా పని చేస్తుందన్నారు. వీఐటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధత గురించి వివరించారు. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 100 బృందాలు, 300 విద్యార్థులు ఈ జాతీయస్థాయి హ్యాకథాన్ ఎక్స్‌కి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ ఐటీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగం డైరెక్టర్ కె.దపూర్యన్ నాయక్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ మేనేజర్ పి.శ్రీనివాసులు, వీఐటీ రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్ పాషా, కో-ఆర్డినేటర్ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

● ది రేషనలిస్ట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు తమిళ సెల్వన్
● నేడు ముగియనున్న నాస్తిక మేళా సమావేశాలు



నాస్తిక మేళాలో ప్రసంగిస్తున్న తమిళ సెల్వన్

మంగళగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మూఢనమ్మకాలను పారదోలి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ది రేషనలిస్ట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు తమిళ సెల్వన్ కోరారు. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలోని చార్వాక ఆశ్రమంలో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో శనివారం నాస్తికమేళా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముందుగా తమిళ సెల్వన్ నాస్తిక జెండాను ఆవిష్కరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ సభ్యులు చైతన్య గీతాలను ఆలపించారు. తమిళ సెల్వన్ మాట్లాడుతూ మతం పేరుతో ప్రజలను విభజించే వారికి వ్యతిరేకంగా నాస్తిక ఉద్యమం ప్రారంభమైందన్నారు. పెరియార్ రామస్వామి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారని, ఫలితంగానే నేడు తమిళనాడులో శాస్త్రీయ ఆలోచనలతో ప్రజలు ముందుకెళుతున్నారన్నారు. రాయపూర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ కే.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైన్స్ ఎలా అభివృద్ధి చెందింది, జీవ పరిణామం ఎలా జరిగింది అనే విషయాలను ఉద్బోధించారు. మతవాదులు ప్రజల్లో మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్నారన్నారు. సైన్స్ వల్లనే నేడు పురోభివృద్ధి సాధించామని, ప్రజల మధ్య కుల, మత అడ్డుగోడలను తొలగించి సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డ్డార్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సైన్సు ప్రాధాన్యతను పిల్లలకు కథల రూపంలో ఆసక్తికరంగా వివరించాలని సూచించారు. నిరూపించని ఏ విషయాన్నీ నమ్మకూడదు అనే బలమైన విశ్వాసాన్ని విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ సమావేశాల్లో నాస్తిక సంఘం గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన నాస్తిక సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదనందిపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడులోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణేశ్వర స్వామి వారి దేవస్థానం ఆవరణలో శ్రీ శృంగేరి శారత పీఠ పాలిత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఎంతో ఘనంగా మొదలైనవి. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గణపతి పూజ, పుణ్యహవాచనం, మండపారాధన, కలశ స్థాపన, మండప ప్రవేశం ఎంతో అత్యంత వైభవోపేతముగా జరిగినవి. రెండో రోజు ఆదివారం జలాధివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, హోమం జరుగును. మూడో రోజు సోమవారం ఉదయం పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, మహ అన్నప్రసాద వితరణ, కార్యక్రమాలు ఎంతో అత్యంత వైభవపేతంగా నిర్వహించేందుకు అని ఏర్పాటు పూర్తియినట్లు దేవాలయాల పాలకమండలి నిర్వహణ కమిటీ వారు పేర్కొన్నారు.

మలినేనిలో ముగిసిన 36 గంటల హాక్‌థాన్



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాలలో శుక్ర, శనివారాల్లో సీఎస్ఈ డేటా సైన్స్ మూడో సంవత్సరం విద్యార్థినులకు మేక్ స్కిల్ల్ ఆధ్వర్యంలో ఏఐ ఫర్ వెబ్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన '36 గంటల హాక్‌థాన్' శనివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జ్యూరీమెంబర్స్ వాష్టన్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో నెల్లూరు సాయి తరుణ్, లౌవ్‌లీ చాకోస్, బిగులు వ్యవస్థాపకుడు సత్య వాసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ 36 గంటల హ్యాక థాన్‌లో విద్యార్థినులు తయారుచేసిన ప్రతి ప్రాజెక్టులో ప్రయోగాత్మకత, ఆధునిక సాంకేతికతతో కూడిన నైపుణ్యం ప్రతిబింబిస్తుందన్నారు. మలినేని సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళ మాట్లాడుతూ విద్యార్థినులు ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకొని ప్రతిభను మెరుగు పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం లో జే అప్పారావు, సీఎస్ఈ డేటా సైన్స్ హెడ్ ఎన్. హరికృష్ణ, మేక్ స్కిల్ల్ కంపెనీ సీఈవో పీ మధు, ఇతర విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నేతలు

తాడేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధ పడుతూ హైదరాబాద్ బసవతారకం హాస్పిటల్‌లో చికిత్స పొందిన తాడేపల్లికి చెందిన చిన్నారి కార్తీకకు జనసేన నేతలు శనివారం రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. తాడేపల్లికి చెందిన జీ నాగదీపక్, ప్రశాంతిల పెద్ద కుమార్తె కార్తీక బ్రెయిన్ క్యాన్సర్‌కు గురై హైదరాబాద్ బసవతారకం హాస్పిటల్‌లో చికిత్స తీసుకొంది. అనంతరం పాపకు ప్రతి రోజూ ఫిజియోథెరపీ చేయించాల్సి ఉండగా అందుకు ఆ దంపతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక జనసేన నేతలు స్పందించి రూ.10 వేలను వారికి అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు కాశిమాల దినేష్ చక్రవర్తి, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, మేకా నాని, బత్తుల వెంకటేశ్వరరావు, కె.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేది బీజేపీ ప్రభుత్వమే

● ఢిల్లీలో విజయంపై సంబరాలు



తుళ్లూరు సినిమాహాలు సెంటర్‌లో బాణ సంచా కాల్చుతూ సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

తుళ్లూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పీఠాన్ని బీజేపీ దక్కించుకోవడంతో తుళ్లూరు సినిమాహాలు సెంటర్ వద్ద బీజేపీ నేతలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మెరుగైన పనితీరుపై డిల్లీ ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. 48 అసెంబ్లి స్థానాలు బీజేపీ గెలుచుకొని 27 సంవత్సరాల తరువాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయ బోతుండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, రాష్ట్ర నాయకులు కొమ్మినేని సత్యనారాయణ, జిల్లా నేతలు మార్త నరేంద్ర, బీసీ మోర్చా నేత హేమసుందర్, తాళ్లూరు వీరయ్య, బెజ్జం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టిన ఢిల్లీ ప్రజలు

దుగ్గిరాల, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారం లోకి వచ్చాక దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఢిల్లీ ప్రజలు పట్టం కట్టారని బీజేపీ జిల్లా కార్యదర్శి చుం దూరు ఉమామహేశ్వరరావు అన్నా రు. కాంగ్రెస్, ఆప్ పాలనపట్ల విరక్తి చెందిన ఢిల్లీవాసులు 27ఏళ్ల తర్వాత తిరిగి బీజేపీకి పట్టం కట్టారన్నారు.

ప్రజలు చరిత్రాత్మక తీర్పును ఇచ్చారు

● రాష్ట్ర నాయకుడు జంధ్యాల

పెదనందిపాడు, (వరగాని) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పును ఇస్తూ బీజేపీకి పట్టం కట్టారని రాష్ట్ర నాయకుడు జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి అన్నారు. మండల పరిధిలోని వరగానిలో నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, కూటమి నాయకులు ప్రభాకర్,రామినేని శ్రీనివాసరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐవోసీ పేరిట మోసపూరిత లావాదేవీపై ఫిర్యాదు

తుళ్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)పేరిట మోసపూరిత లావాదేవీ జరగటంపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం తాడేపల్లికి చెందిన కె.కృష్ణమూర్తి తాడేపల్లిలో ఉంటూ వెలగపూడి సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నా డు. ఆయన ఐఓసీ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్రోలు బంకు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వివరాలు డాక్యుమెంట్లు సబ్మిట్ చేశాడు. ఫిబ్రవరి 3న ఓ వ్యక్తి సేల్స్ ఎగ్జిక్యూటివ్ అని కృష్ణమూర్తిని పరిచయం చేసుకొన్నాడు. తరువాత ఫోన్ చేసి మీకు మెయిల్ వస్తుందని చెప్పాడు. అందులో ఉన్న వివరాల ప్రకారం ప్రాసెస్ చేయమని చెప్పాడు. మెయిల్ రిజిస్ట్రేషన్ కోసం రూ.49,500 ఐడీబీఐ బ్యాంకు అకౌంట్‌కు చెల్లించాలని నెంబరు ఇచ్చాడు. ఆ నంబర్‌కు బాధితుడు కృష్ణమూర్తి ఆ మొత్తం నెఫ్ట్ ద్వారా చెల్లించాడు. పెట్రోలు బంకు అలాట్‌మెంట్ అగ్రిమెంట్ కోసం రూ.3,99,900 చెల్లించమని సేల్స్ మేనేజర్ అని చెప్పుకున్న వ్యక్తి మరలా అడిగాడు. అంత మొత్తం లేదని చెప్పటంతో ప్రాసెస్ కోసం కొంత మొత్తం ఇవ్వాలని సదరు వ్యక్తి కృష్ణమూర్తిని కోరాడు. మరలా లక్ష రూపాయలు అదే అకౌంట్‌లోకి జమ బాధిదు కృష్ణ మూర్తిజమ చేశాడు. తరువాత దీనిపై ఆయనకు అనుమానం రాగా, విజయవాడ ఐఓసీ కార్యాలయంలో సంప్రదించాడు. ఐడీబీఐ బ్యాంకు అకౌంట్ అనేది ఐఓసీకి లేనే లేదని, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా లేదా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మాత్రమే కంపెనీ అకౌంటులు ఉంటాయని చెప్పటంతో, మోసపోయానని కె.కృష్ణమూర్తి గమనించి తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ కొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

15న భావనారుషి స్వామి కల్యాణోత్సవం

మంగళగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్త మంగళగిరిలోని నాంచారమ్మ ప్రాంగణంలో కొలువైన భద్రావతీ సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని 15వ తేదీ నిర్వహిస్తున్నట్లు మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతి నిధులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను సంఘ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్ర నాథ్, కనకయ్య, మునగపాటి వెంకటేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు అధిక ప్రోత్సాహం



మంత్రి అచ్చెన్నాయుడును కలిసి తెలుగు రైతు సేవా అధ్యక్షుడు విజయకుమార్, ఉప్పుటూరి చినరాములు బృందం

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రోత్సాహన్నిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపినట్లు తెలుగురైతు సేవా అధ్యక్షుడు చెరుకూరి విజయకుమార్, ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ ఉప్పుటూరి చినరాములు అన్నారు. శనివారం వారు రాజధాని అమరావతిలోని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి మండలంలోని ఇతర సమస్యలతో పాటు పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నదని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరికపూడి పాపారావు, యడ్లపల్లి వాణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు



రేవేంద్రపాడులో శ్రీఅభయాజంనేయస్వామిని దర్శించుకుంటున్న బీసీ సంక్షేమసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, భక్తులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడులోని జ్ఞాన సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవం, మందిరం, అభయాంజనేయస్వామి ఆలయాల వార్షికోత్సవ కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున బాబావారికి కాకడహారతి, విఘ్నేశ్వరపూజ, అభిషేకాలు అనంతరం వస్త్రాలంకరణ, అర్చన, మంత్రపుష్ప సమర్పణ, శిఖరకలశ కుంబాభిషేకం, నాగదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సైకం శివయ్య, కంచర్ల సుబ్బారావు, చిట్టిబొమ్మ వెంకట్రామయ్య తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పీహెచ్‌సీలో జిల్లా అధికారి తనిఖీ



నుదురుపాడు పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుదరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా రెమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు శనివారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు వైద్యాధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తల్లి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అలాగే ఆరోగ్య విషయాలపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫరీనా బేగం, పీహెచ్‌వో ఎన్‌వీ లక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు కే సుదర్శనరాజు, ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వలసదారులపై అమెరికా తీరు దుర్మార్గం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వలసదారులను వెనక్కి పంపుతున్న అమెరికా తీరు దుర్మార్గంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే దిలీప్ శనివారం ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ వలసదారులకు సంకెళ్లు వేసి బంధించి పంపుతున్న తీరు విద్యార్థులు, వలసదారుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అమెరికా వ్యవహారంపై ప్రధానమంత్రి నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం తగదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వలసదారుల కుటుంబాల్లో భరోసా కల్పించే విధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'కుష్టువ్యాధి-చికిత్స' అనే అంశంపై బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఈ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఫార్మసీ విద్యార్థులకు సూచించారు. డబుల్ హార్స్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గారావు, వహీద్ బాషా, రమణయ్య, పద్మ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న మహిళను ఢీకొట్టిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేట మఠంబజారుకు చెందిన గన్నవరపు జయలక్ష్మి (60) రోజువారి కూలీగా జీవనం సాగిస్తుంది. శుక్రవారం రాత్రి పనులు ముగించుకొని ఇంటికి వైకుంఠపురం రోడ్డులో నడిచి వెళ్తుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొట్టింది. రోడ్డుపై ముందుకు పడిపోయిన ఆమె గాయాలపాలై జిల్లా వైద్యశాలలో చికిత్స పొందింది. ఈ మేరకు శనివారం ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వెంకటకృష్ణాపురానికి చెందిన గాజుల జోసఫ్ ఇమానియేలు (26) తల్లి కొంత కాలం క్రితం అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ శనివారం ఉదయం కొలకలూరు సమీపంలో రైల్వేట్రాక్‌పైకి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయండి: ఏపీటీఎఫ్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రభుత్వం బాధ్యత అని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మొవ్వా గార్డెన్స్‌లో శనివారం విద్యా సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వలన పాఠశాల విద్యా వ్యవస్థ నష్టపోయిందన్నారు. సుమారు 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని తెలిపారు. వారిని తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వచ్చే విధంగా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. రాష్ట్ర విద్యా విధానంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం తగదని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పోరాడి సాధించుకున్న సౌలభ్యాలను ప్రభుత్వం, అధికారులు హరించడం సరికాదన్నారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షుడు కే బసవలింగారావు ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ వరప్రసాదరావు, జిలాని, రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాష, మక్కెన శ్రీనివాసరావు, ఉస్మాన్ రవికుమార్, మల్లేశ్వరి, భద్రుద్దీన్ స్థానిక కమిటీ నాయకులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఏపీటీఫ్ నాయకులు పాల్గొన్నారు.

తీరప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత

● జి.మురళీధర్

బాపట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత అని అఖిల భారత సీమ జాగరణ మంచ్ సంయోజక్ జి.మురళీధర్ అన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 20వ రాష్ట్ర సర్వసభ్య సమావేశాలు శనివారం శీలంవారిపాలెంలోని హితైషిణి కార్యాలయంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మత్స్యకార సంక్షేమ సమితి గత 20 సంవత్సరాలుగా మత్స్యకార గ్రామాలపై దృష్టిసారించి మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి గురించి పనిచేస్తున్న సంస్థ అని అన్నారు. కుల వృత్తులలో అత్యంత ప్రమాదకరమైనది సముద్రంలో చేపల వేట అని, వేటకెళ్ళే సమయంలో ఆపదను ఎదుర్కొనేందుకు మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఫిషర్మెన్, లైఫ్ సేవింగ్ సేఫ్టీ టెక్నిక్ కోర్సులలో శిక్షణ ఇప్పించాలన్నారు. చీరాల, బాపట్ల మండలాల మధ్యలో ఉన్న అడవిపాలెం పంచాయతీలో ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాల్వను పూడిక తీయించి ఆ కాల్వలో బోట్లు కట్టుకునే వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సముద్రవ్యాపారులు, మత్స్యసంపద ఉత్పత్తుల వ్యాపారులు ఎగుమతులలో వస్తున్న లాభాలలో 25 శాతం రాయల్టీని మత్స్యశాఖా అభివృద్ధికి కాకుండా మత్స్యకారుల అభివృద్ధికి కేటాయించి విద్య, ఆరోగ్య సామాజిక భద్రత అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. రూ.30 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. తీరప్రాంత మత్స్యకార పంచాయతీలలో హైస్కూల్ లేని చోట కొత్తగా హైస్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు అన్ని రంగాలలో నామినెటెడ్ పదవులు ఇవ్వాలని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సంఘ సంచాలక్ హరికుమార్‌రెడ్డి, పోలయ్య, 26 జిల్లాల నుంచి మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల నూతన విధానంపై ఉపాధ్యాయ వర్గాల్లో ఎడతెగని చర్చలు

● జీవో 117 రద్దుపై హర్షాతిరేకాలు
● మోడల్ స్కూల్స్ ఎంపికపై తగిన కసరత్తు చేయని విద్యాశాఖ
● విమర్శలు రావడంతో కమిటీలకే నిర్ణయాధికారం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన పాఠశాలల విధానంపై ఉపాధ్యాయుల్లో ఎడతెగని చర్చ నడుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జీవో 117ను అమలు చేసింది. ఈ జీవోను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇదే అంశం మోడల్ స్కూల్, ఫౌండేషన్ స్కూల్, బేసిక్ స్కూల్ పేరుతో అమలు చేయాలనే నిర్ణయాలు విమర్శలకు గురవుతున్నాయి. దీనిపై ఆయా మండలాల్లో విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు కసరత్తు చేయాల్సిన బాధ్యత అప్పగించారు. ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సంఘాలను, తల్లిదండ్రులను సంప్రదించకుండా ఈ విధానం అమలు చేసేందుకు ప్రాథమికంగా చేసిన కసరత్తు విమర్శలకు గురవుతోంది. గత ప్రభుత్వం తమ పిల్లలకు సమీపంలో ఉన్న పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను వేరే చేసి ఉన్నత పాఠశాలలకు పంపడంతో అంత దూరం విద్యార్థులను పంపలేక తీసుకు వెళ్లేందుకు తమకు వీలుకాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కాన్వెంట్ వాహనాలను ఎక్కించి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. మరికొందరు తల్లులు పనులు మానుకుని తమ పిల్లలను దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు తీసుకువెళ్లి, తీసుకురావడం చేస్తున్నారు. ఈ విధానం రద్దు అయ్యిందన్న ఆనందం ఉన్న తల్లిదండ్రుల్లో నూతన విధానం కారణంగా లేకుండా పోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికో మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం, అక్కడ ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా మంచి విద్యాబోధన చేసేలా ప్రభుత్వం తలపెట్టింది. అయితే ఈ మోడల్ పాఠశాల ఎంపిక గ్రామంలో అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలతో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన సమావేశంలో నూతన విధానంలో పాఠశాలల ఎంపికను విద్యాకమిటీలను సంప్రదించి చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా నివాసాలకు సమీపంలోనే ప్రాథమిక పాఠశాలలు ఉండటంతో ఆర్థిక స్థోమత లేని వారంతా ప్రభుత్వ పాఠశాలలకు పిల్లల్ని పంపుతున్నారు. ఇప్పుడు మోడల్ స్కూల్స్ పేరిట మంచి బోధన అందే అవకాశాలను ప్రభుత్వమే కల్పిస్తున్న దూరంగా ఉండే పాఠశాలలను మోడల్‌గా ఎంపిక చేస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గ్రామాల వారీగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో విద్యాశాఖాధికారులు సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలకు అనుగుణంగా నూతన పాఠశాలల విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

నూతన పాఠశాలల విధానం అమలు విద్యాశాఖకు కత్తిమీద సాము

నూతన పాఠశాలల విధానం అమలు చేయడం విద్యాశాఖకు కత్తిమీద సాములా మారింది. గత ప్రభుత్వం జీవో 117 జారీ చేసి ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానం రద్దు చేయడంతో పాటు ఫౌండేషన్, బేసిక్, మోడల్ స్కూల్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు వెనక్కివచ్చి ప్రాథమిక పాఠశాలలో చేరిన తరువాతే ఎక్కడ ఎంతమంది ఉంటారనే విషయం స్పష్టమవుతుంది. ఆ ప్రకారమే ఉపాధ్యాయ కేటాయింపులు, హేతుబద్ధీకరణ నిర్వహించాల్సి ఉంటుంది. మరో పక్క ఉపాధ్యాయ బదిలీల కోసం చట్టాన్ని చేయాలనే తలంపుతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖకు దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయ బదిలీలకు పారదర్శకత నిర్వహించేలా, విద్యా సంవత్సరానికి ఆటంకం లేకుండా ఉండేలా వేసవి సెలవుల్లోనే ముగించే ప్రణాళికను సిద్ధం చేయాలని తలపెట్టినా ఆచరణ సాధ్యం అయ్యే పరిస్థితులు కనబడటం లేదు. నూతన పాఠశాలల విధానం, ఉన్నత పాఠశాలల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్లస్-2 విధానంలో తీసుకోవాల్సిన నిర్ణయాలతో బదిలీల ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని, విద్యా సంవత్సరం మధ్యలోనే ఈ ప్రక్రియ నిర్వహించాల్సిన అవశ్యకత ఏర్పడిందని సంఘాల నాయకులు చెబుతున్నారు. జీవో 117 రద్దు, నూతన పాఠశాలల విధానం, హైస్కూల్స్‌లో ప్లస్-2పై స్పష్టత రాకపోవడంతో విద్యాశాఖ తరచుగా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తోంది. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఈ అంశాలతో చేస్తున్న భిన్న ప్రకటనలు ఉపాధ్యాయుల్లో నిత్యం చర్చలకు దారి తీస్తున్నాయి. ఈ పరిస్థితి బోధనపై ప్రభావం చూపుతుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. అందరికి ఆమోదయోగ్యకరమైన రీతిలో నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా విద్యాశాఖ కసరత్తు పూర్తి చేయాలని పలువురు సూచిస్తున్నారు. ఈ విధానాల కారణంగా ముఖ్యమంత్రి తొలి సంతకంతో ప్రకటించిన డీఎస్సీకి ఎలాంటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా విద్యాశాఖపై ఉందని చెబుతున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్

మేజర్ లాజిస్టిక్‌గా ఇండియా పోస్టు

● పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్
● ప్రధాన తపాలా కార్యాలయంలో తనిఖీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్టు దేశంలో మేజర్ లాజిస్టిక్‌గా గుర్తింపు పొందిందని ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్ అన్నారు. తెనాలి హెడ్ పోస్టాఫీసును శనివారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. పోస్టాఫీసు ద్వారా తెనాలి పట్టణ ప్రజలకు అందుతున్న వివిధ రకాల సేవల పురోగతిని పరిశీలించారు. కార్యాలయ సిబ్బందిని, పోస్టాఫీసుకు వచ్చిన ఖాతాదారుల సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇండియా పోస్టుకు గుర్తింపు లభించిందన్నారు. లాజిస్టిక్ విభాగంలో కీలకపాత్ర పోషిస్తుందని, ఈ-కామర్స్‌లో భారీ సంఖ్యలో లావాదేవీలు నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యమైన ప్రాంతాలలో పోస్టాఫీసులు 20 రకాల సేవలను అందిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సేవలను అందుకుంటున్నది లేనిది విచారించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. పోస్టాఫీసు సేవల ఉపయోగాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బీమా రంగంలో మెరుగైన పోస్టల్ జీవిత బీమాను ప్రజలు వినియోగించుకునేలా, బాలికల సంక్షేమానికి ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఎంతో ఉపయోగకరమైందన్నారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల నిర్వహించిన సమావేశంలో అందించిన సూచనలు అనుసరించి పోస్టాఫీసులకు పేరు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కరుణాకరబాబు, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

చేబ్రోలు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొడవర్రులో పునః నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌తో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వాచనాలు స్వీకరించారు.



ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

మలుపులో గుంతను పూడ్చండి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీరావుపేటలోని రైల్వే స్టేషన్‌రోడ్డు మలుపులో ఉన్న పెద్దగుంత కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంటూరు నుంచి తెనాలి బస్టాండ్‌కు వెళ్లే బస్సులు, వాహనదారులు నిత్యం ఈ మార్గం నుంచే వెళుతుంటారు. రోడ్డు మలుపులో ఉన్న ఈ గుంతను గమనించక ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని, ప్రమాదాల బారిన పడకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డు మలుపులో ఉన్న గుంత

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చేబ్రోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నట్లు నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపారు. దుగ్గిరాలకి చెందిన చుండూరు భాస్కరరావు ఆర్థిక సహకారంతో నారాకోడూరు జడ్పీ హైస్కూల్లో 174 మంది పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాగృతి భారతీయ సేవా సంస్థ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వీ నాగమల్లేశ్వరరావు, పీ భాస్కరరావు, వెలగా పవన్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న భాస్కరరావు

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి పూజలు చేశారు. ధ్వజారోహణ, విష్వక్సేన పూజా విధులను వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, రమేష్‌లు నిర్వహించారు. సంకీర్తన బృందాల ఆధ్వర్యంలో మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ, హనుమాన్ చాలీసా పఠించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ శివ, రామారావు, బాలకృష్ణ చంద్రశేఖర్, అనురాధ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి పూజలు చేస్తున్న అర్చకుడు

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నిలువరిస్తాం : ఎస్ఐ

కొల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల అనుమతులు పూర్తి కావడంతో తవ్వకాలు, రవాణా జరగకుండా నిలువరిస్తామని ఎస్ఐ ఏడుకొండలు చెప్పారు. మండల పరిధిలోని గాజుల్లంక, జువ్వలపాలెం, పెసర్లంక అరవింద వారధి, చిలుమూరు గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన పికెట్లను శనివారం సాయంత్రం పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మండల పరిధిలో విస్తరించి ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని, ఎవరైనా కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటే వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించాలని సూచించారు. ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చే వరకు పికెట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇసుక అక్రమార్కులపై కన్నేసి ఉంచాలని, ఎప్పటికప్పుడు గస్తీ తిరుగుతూ పర్యవేక్షిస్తుంటామని తెలిపారు. పరిశీలనలో ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ల పరిశీలనలో ఎస్ఐ ఏడుకొండలు

అవయవదానంతో అమరత్వం

బాపట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో అమరత్వం పొందవచ్చునని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. అవయవదానంపై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయదానంతో ఎందరో జీవితాలలో వెలుగులను నింపవచ్చునన్నారు. అవయవదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరు ముందుకురావాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం

● ఎమ్మెల్సీ బీటీ నాయుడు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని తెనాలి నియోజవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, ఆదోని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్‌కె. కరిముల్లా ఇతర నాయకులతో కలిసి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుందని, కూటమి నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి ఆలపాటికి ఘన విజయం చేకూర్చాలని కోరారు. బ్యాలెట్ నమూనా ఇతర అంశాలపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా వార్డుల వారీగా జరుగుతున్న ప్రచారం, ఇతర అంశాల గురించి నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకుని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు నాయకుడు బొంతు శివసాంబిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, రాష్ట్ర కృష్ణబలిజసంఘం చైర్‌పర్సన్ కావేటి సామ్రాజ్యం, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహమ్మద్ ఖుద్దుస్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి రావి కృష్ణమోహన్, కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనిత, అన్నం పిన్నారావు పాల్గొన్నారు.

ఆలపాటి విజయం కోరుతూ టీడీపీ నాయకుల తిరుమల యాత్ర

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని టీడీపీ నాయకులు తిరుమల యాత్ర చేశారు. పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, పాలడుగు శ్రీనివాసరావు, ఆలపాటి కిరణ్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు.



తిరుమలలో దర్శనం చేసుకున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి : ఏపీటీఎఫ్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రభుత్వం బాధ్యత అని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మొవ్వా గార్డెన్స్‌లో శనివారం విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాల వలన పాఠశాల విద్యా వ్యవస్థ నష్టపోయిందన్నారు. సుమారు 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని తెలిపారు. వారిని తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు వచ్చే విధంగా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. రాష్ట్ర విద్యా విధానంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం తగదని అన్నారు. సమాజ శ్రేయస్సుకు అవసరమైన విద్యా విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలు పోరాడి సాధించుకున్న సౌలభ్యాలను ప్రభుత్వం, అధికారులు హరించడం సరికాదన్నారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షుడు కే బసవలింగారావు ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ వర ప్రసాదరావు, జిలాని, రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాష, మక్కెన శ్రీనివాసరావు, ఉస్మాన్ రవికుమార్, మల్లేశ్వరి, భద్రుద్దీన్ స్థానిక కమిటీ నాయకులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఏపీటీఫ్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక 17వ వార్డుకు చెందిన గోవర్ధనం విజయశ్రీ (73) శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చేబ్రోలు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న విజయశ్రీ కుమారుడు రఘునాథ చక్రవర్తిని, మరో కుమారుడు రామకృష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



మృతురాలికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

నేడు వేమూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

● ప్రారంభించనున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం వేమూరులోని శ్రీకృష్ణ చైతన్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం జిల్లా అంధత్వ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభిస్తారని అన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగానే శస్త్ర చికిత్సలు నిర్వహించబడతాయన్నారు. కళ్ళజోళ్ళు, మందులు ఉచితంగా ఇస్తామన్నారు. గుండె జబ్బులు, షుగర్ వ్యాధి, కిడ్నీ వ్యాధి, క్యాన్సర్ తదితర దీర్ఘవ్యాధులు కలిగిన వారు సంబంధించిన రిపోర్టులను తీసుకు రావాలన్నారు.